# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

మంగళవారం 24 డిసెంబర్ 2024


## ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

చిన్నమండెం, డిసెంబర్ 23 ప్రభాత వార్త:



ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం చిన్నమండెం మండలం, బో రెడ్డిగారిపల్లె లోని తమ నివాసం నందు మంత్రి ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రాజా సమస్యలు అధికంగా ఉన్నందున ప్రజా దర్బార్ కార్యక్రమం ద్వారా సమస్యల పరిష్కరించడం జరుగుతుందన్నారు. ప్రజాదర్బార్‌లో వచ్చే సమస్యలలో 90 శాతానికి పైగా భూ సమస్యలు ఉన్నాయని వీటి పరిష్కారానికి రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. తహసిల్దార్ కార్యాలయాలలోని వీఆర్వోల నుంచి తహసిల్దార్ వరకు గ్రామాలలో పర్యటించి భూ సమస్యలపై ఆరా తీయాలన్నారు. ఈ సందర్భంగా సమస్య లతో వచ్చిన బాధితుల సమస్యలను మంత్రివర్యులు స్వీకరించి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేయడం జరిగింది.

## ఆధారాలతో కూడిన సమస్యలను విన్నవించండి

మదనపల్లె, డిసెంబర్ 23 ప్రభాతవార్త :



ప్రజలు సమస్యలను విన్నవించేటప్పుడు ఆధారాలతో కూడిన సమస్యలను అర్జీ రూపంలో విన్నవించాలని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ తెలిపారు. సోమవారం సబ్‌కలెక్టరేట్‌లో జరిగిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ ప్రజల నుంచి వివిధ సమస్యలను అర్జీ రూపంలో స్వీకరించారు. ప్రధానంగా భూసమస్యలు, రోడ్లు, సంక్షేమ పథకాల గురించి డివిజన్ పరిధిలోని వివిధ మండలాలకు చెందిన ప్రజలు సమస్యలను విన్నవించారు. అనంతరం సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు విన్నవించిన సమస్యలను విచారించి ఆయాశాఖల ద్వారా గడువులోపు పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. ప్రతి సోమవారం సబ్‌కలెక్టరేట్‌లో జరిగే ప్రజా ఫిర్యాదుల విభాగాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల స్థాయిలో కూడా ప్రజలు సమస్యలను ఆయా తహశీల్దార్ల వద్ద సోమవారం జరిగే ప్రజాఫిర్యాదుల విభాగంలో విన్నవించుకోవచ్చునన్నారు.

## ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చడమే ఆర్టీసీ ముఖ్య ఉద్దేశం

నూతన బస్సులను ప్రారంభించిన రవాణా, శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి







రాయచోటి, డిసెంబర్ 23 ప్రభాతవార్త

ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చడమే ఆర్టీసీ యొక్క ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం రాయచోటి పట్టణంలోని శివాలయం సర్కిల్ నందు 8 నూతన ఆర్టిసి బస్సులను రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.... ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చడమే ఆర్టీసీ యొక్క ముఖ్య ఉద్దేశమని రాబోయే రోజులలో ప్రయాణికుల సౌకర్యార్థం మరిన్ని నూతన బస్సులు ప్రారంభించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో ఏపీఎస్ఆర్టీసీని బలోపేతం చేసి ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందన్నారు. ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను తప్పక నెరవేర్చడం జరుగుతుందన్నారు. రాబోయే కాలంలో ఏపీ ఎస్ఆర్టీసీని పూర్తి ప్రక్షాళన చేసి ప్రయాణికులకు నాణ్యమైన సేవలందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రాబోయే రోజులలో ఎక్కడ చూసినా ఎలక్ట్రిసిటీతో నడిచే బస్సులను రోడ్లపైకి తీసుకు రావడం జరుగుతుందన్నారు.




## ఆరాధ్యుడు, దయామయుడు, కరుణామయుడు ఏసుక్రీస్తు







రాయచోటి, డిసెంబర్ 23ప్రభాత వార్త

ఆరాధ్యుడు, దయామయుడు, కరుణామయుడు, ఏసుక్రీస్తు అని రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రహారెడ్డి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున క్రిస్మస్2024 హైటి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ సుమారు రెండువేల ఏళ్ల క్రితం రోమ్ సామ్రాజ్యంలో జన్మించిన ఏసుక్రీస్తు ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమందికి ఆరాధ్యుడు, దయామయుడు, కరుణామయుడుగా క్రైస్తవులతో ఆరాధనలు అందుకుంటున్నారన్నారు.క్రిస్మస్ పండుగ ఏసుక్రీస్తు జననానికి గుర్తుగా ప్రపంచవ్యాప్తంగా వందల కోట్ల మంది ప్రజలు డిసెంబర్ 24, 25వ తేదీలలోఅత్యంత ఘనంగా జరుపుకుంటారన్నారు. ప్రభుత్వం క్రిస్మస్ పండుగను రాష్ట్ర పండుగగా గుర్తించి ప్రభుత్వం తరపున సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించుకోవడం జరుగుతోందన్నారు. గతంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు క్రిస్టియన్ సోదరులకు విద్య, ఉద్యోగాలలో ఎన్నో అవకాశాలు కల్పించడం జరిగిందన్నారు. రాబోయే రోజులలో ప్రభుత్వానికి పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. క్రిస్మస్ అంటే శాంతికి చిహ్నమని రాష్ట్ర ప్రజలందరూ శాంతియుతంగా, సుఖ సంతోషాలతో జీవించాలని కోరుకుంటున్నానన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేందర్ మాట్లాడుతూ కరుణ, దయ, దాతృత్వం కలిగిన ఏసుక్రీస్తు బోధనలు సర్వ మానవాళికి దారి చూపుతాయన్నారు. క్రిస్మస్ హైటీ కార్య క్రమంలో భాగంగా మంత్రి కేక్ కట్ చేసి క్యాండిల్ వెలిగించి క్రైస్తవ సోదరులందరికీ రాష్ట్ర ప్రభుత్వం తరఫున క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మధు సూదన్ రావు, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి షేక్ ఇమ్రాన్, పాస్టర్లు, క్రిస్టియన్ సోదరులు తదితరులు పాల్గొన్నారు

## నినాదాల హోరుతో దద్దరిల్లిన కడప కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం

కడప కార్పొరేషన్, డిసెంబరు 23 ప్రభాతవార్త:

కడప మేయర్ కు మహిళలంటే చిన్నచూపుని, అందుకే మహిళలను నిలబెట్టారని కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి విరుచుకుపడ్డారు. వైసీపీ పాలనలో కుడి ఎడమవైపు ఎమ్మెల్యేలను కూర్చోబెట్టుకున్నారని మరి ఇప్పుడు టిడిపి ఎమ్మెల్యేలకు వేదిక పైన కుర్చీలు వేయకపోవడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఎమ్మెల్యేలకు వేదిక పైన కుర్చీలు వేసి పూర్వ సాంప్రదాయాన్ని కొనసాగించాలని కార్పొరేటర్లు సుబ్బారెడ్డి, సూర్యనారాయణరావులతో పాటుగా టిడిపిలోకి చేరిన ఇతర కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. మేయర్ డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ప్లే కార్లు ప్రదర్శించి పోడియం చుట్టుముట్టారు. వీరికి పోటీగా వైసిపి కార్పొరేటర్లు సభను కొనసాగించాలని, ఎజెండా చదివి వినిపించాలని కోరారు. ఇలా టిడిపి వైసిపి సభ్యుల నిరసనల, నినాదాల మధ్య సభ హోరెత్తింది. వైసిపి టిడిపి సభ్యుల మధ్య స్వల్ప తోపులాట జరిగింది. సోమవారం కడప నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం మేయర్ కె.సురేష్ బాబు అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ప్రారంభమైంది. సభ ప్రారంభంలో యజెండాను చదివే క్రమంలో ఎమ్మెల్యే మాధవి, టిడిపి సభ్యులు అడ్డుకున్నారు. కుర్చీ కోసం మరో మారు ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. గత సమావేశంలో కూడా ఇలాంటి సంఘటనే ఉత్పన్నమవడంతో ఆ సమావేశం వాయిదా పడింది. సోమవారం అభివృద్ధి పనులకు నిధులు, కాంట్రాక్టు, అదనపు పారిశుద్ధ కార్మికుల వేతనాల నిధులు ఆమోదం కోసం మరో మారు సర్వసభ సమావేశం ఏర్పాటు చేశారు. కానీ టిడిపి సభ్యులు ఒక టిన్నర గంట పాటు నిరసనలు ప్రదర్శించడంతో సభ ముందుకు కొనసాగలేదు. దీంతో మేయర్ సురేష్ బాబు ఎమ్మెల్యే, టిడిపి కార్పొరేటర్లను సస్పెండ్ చేసి వాయిదా వేశారు. భోజన విరామం అనంతరం తిరిగి సభ ప్రారంభమైనప్పటికీ యధాస్థితి కొనసాగింది. సభ్యుల నిరసనలు, ప్రదర్శనలు, నినాదాలు, గందరగోళం మధ్యనే ఎజెండాలో పొందుపరిచిన అంశాలను ఆమోదిస్తున్నట్లు సురేష్ బాబు ప్రకటించారు. అనంతరం ఎమ్మెల్యే మాధవి రెడ్డి మీడియాతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఉన్నప్పుడు మేయర్ కుడి ఎడమ వైపు వేదికపై కుర్చీలు వేశారని గుర్తు చేశారు. ప్రభుత్వం మారి టిడిపి అధికారంలోకి రాగానే మొదటి సమావేశానికి మేయర్ సురేష్ బాబు హాజరు కాలేదన్నారు. అప్పుడు కుర్చీ యధావిధిగా ఉంచి తనను గౌరవించారని గుర్తు చేశారు. మేయర్ సురేష్ బాబు సమావేశానికి హాజరైన సమయంలో టిడిపి ఎమ్మెల్యేకి మేయర్ పక్కన సీటు లేకుండా చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మేయర్ అవినీతి చేశారని ఆరోపించారు. మహిళలను ఏమాత్రం గౌరవించలేదని విమర్శించారు. మహిళలకు ఇచ్చే గౌరవం ఇదేనా అంటూ నిలదీశారు. మహిళలను మేయర్ అవమానిస్తున్నారని తెలిపారు. చర్చ లేకుండా, అజెండా చదవకుండా, కార్పొరేటర్లకు అవకాశం ఇవ్వకుండానే అజెండా ఆ



మోదించినట్లు మేయర్ ప్రకటించి పారిపోయారని ఎద్దేవ చేశారు. సభ అనంతరం తన చాంబర్లో పాత్రికలతో మేయర్ సురేష్ బాబు మాట్లాడారు. మొదటి సమావేశంలో వేదిక పైన ఎమ్మెల్యే మాధవిని కూర్చోబెట్టామని, వైసిపి కార్పొరేటర్లు గౌరవించి సన్మానం చేశారని గుర్తు చేశారు. నా ఇంటి పైన చెత్త వేయించారని చెప్పారు. వైసిపి కార్పొరేటర్‌ను విమర్శించారని పేర్కొన్నారు. కానీ ఎమ్మెల్యే తీరులో మార్పు రాలేదన్నారు. సభకు అడ్డుపడ్డారని, అజెండా చదువుతుంటే పదేపదే అడ్డు తగిలి ఆ కాపీలను చించేసారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ మనోజ్ రెడ్డి, కార్పొరేషన్ అధికారులు వైసిపి, టిడిపి కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## నూతన బోరును ప్రారంభించిన మంత్రి

చిన్నమండెం, డిసెంబర్ 23 ప్రభాతవార్త:



రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి సోమవారం చిన్నమండెం మండలం, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నీటి సమస్య పరిష్కరించేందుకు నూతన బోరును ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలో శాశ్వత నీటి సమస్య పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామన్నారు. ఇందులో భాగంగా చిన్నమండెం మండలంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నూతన బోరు వేసి విద్యార్థులకు నేటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మంత్రి వర్యులు పాఠశాలలోని విద్యార్థులతో మాట్లాడి అక్కడి వసతులు గురించి తెలుసుకున్నారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు ప్రహరీ గోడ కావాలని ఉపాధ్యాయులు కోరగా మంత్రి ప్రహరీ గోడ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.

## 100 సంవత్సరాలుపైగా జీవించారు

ఒకే రోజు మరణించారు.. మరణంలో కూడా వీడని వీరి బంధం

లక్కిరెడ్డిపల్లి: డిసెంబర్ 23, ప్రభాతవార్త



100 సంవత్సరాలు నీతో కలిసి జీవిస్తానని పదిమంది ముందరా పచ్చని పందిళ్ల కింద ఒకేరోజు ఇద్దరు ఒకటి అయ్యారు ఇలాగే కలసి వందేళ్లు జీవించాలనుకున్నారు 100 సంవత్సరాలు పైగా ఇద్దరు జీవించారు ఒకే రోజు మరణించారు. ఇది లక్కిరెడ్డిపల్లి మండలంలోని పందిళ్ళపల్లి గ్రామం బుర్జుపల్లి లో ఈ సంఘటన చోటు చేసుకుంది బుజ్జిపల్లె గ్రామానికి చెందిన ఉదయగిరి పెద్ద సుబ్బరాయుడు (108) పెద్ద కేశమ్మ (104)లు ఆదివారం ఒకేరోజు మృతి చెందారు .భర్త పెద్ద సుబ్బరాయుడు ఆదివారం ఉదయం 11 గంటలకు మృతిచెందగా మృతుని భార్య పెద్ద కేశమ్మ సాయంత్రం 3 గంటలకు మృతి చెందారు భర్త మరణించిన వెంటనే ఆమె జీర్ణించుకోలేక శ్వాస వదిలిందని మృతుల కొడుకు కుమార్తెలు తెలిపారు వీరి జీవితము 100 సంవత్సరాలు పైగా కొనసాగి ఒకేరోజు ఇద్దరు ఒకే పాడిపై వెళ్లారు వీరికి 11 మంది సంతానం 5 మంది మగ బిడ్డలు 6 మంది ఆడబిడ్డలు వీరు5 తరాల పిల్లలను చూశారు బురుజు పల్లి లో వీరి 5 మంది మగ బిడ్డల సంతానం సగం ఊరిగా ఉంది ఈ మండలంలో వంద సంవత్సరాలు పైగా బతికిన వ్యక్తులంటూ ఉంటే పెద్ద సుబ్బరాయుడు పెద్ద కేశమ్మలు అని అందరూ చెప్పుకుంటున్నారు వీరి అంత్యక్రియలు బుర్జు పల్లి లోనే సోమవారం సాయంత్రం జరిగాయి వీరి అంత్యక్రియలకు తమ కుటుంబ సభ్యులు తోపాటు చుట్టుపక్కల వాళ్ళు హాజరయ్యారు పెద్ద కుమారుడు పెద్ద వెంకటరమణ 75 అమ్మానాన్నల పాడి మోసి వారికి మట్టి పోశారు ఇద్దరికీ అంత్యక్రియలు ఘనంగా నిర్వహించారు.

## అన్నమయ్య ప్రాజెక్టు నిర్మాణంపై పునరాలోచనలో ప్రభుత్వం?

మంత్రి రామానాయుడు వ్యాఖ్యలపై సర్వత్రా అనుమానాలు ... నిధుల సమస్య? లేక ప్రత్యామ్నాయం వైపు చూపా?

**రెండేళ్ల క్రితం కొట్టుకుపోయిన అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణంపై కూటమి ప్రభుత్వం పునారాలోచనలో పడిందా? ప్రత్యామ్నాయం వైపు చూస్తోందా? ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూటమి నేతగా ఇచ్చిన హామీలకు కట్టుబడుతారా? లేక నిధుల కొరత సమస్యతో ప్రాజెక్టును నిర్మించకుండ తక్కువ వ్యయంతో నిర్మించే ఆలోచన ఏమైనా ఉందా? అందుకేనా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావస్తున్న ప్రాజెక్టు పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోకపోవడానికి కారణం ఇదేనా ఈ ప్రశ్నలన్నింటికి రాష్ట్ర ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదివారం జిల్లా పర్యటనకు వచ్చిన సంధర్భంగా అన్నమయ్య ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి తెలుగుదేశం పార్టీ కాపునాడు నాయకులు కలిసి అడిగిన సంధర్భంగా మంత్రి వారితో అన్న మాటలను చూస్తే అన్నమయ్య ప్రాజెక్టు భవిష్యత్తుపై అనుమానాలు వ్యక్తం అయ్యే అవకాశం కనిపిస్తోంది.**

రాజంపేట అర్బన్, డిసెంబర్ 23, ప్రభాతవార్త:

అన్నమయ్య ప్రాజెక్టు నిర్మాణం ఆలస్యం కావడానికి గల కారణాలను మంత్రి నిమ్మల రామానాయుడు వద్ద రాజంపేటకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు కొండా శ్రీనివాసులు, కాపు బలిజ సంక్షేమ సేన ఉపాధ్యక్షుడు టి.సాయిప్రసాద్, నిత్యపూజయ్య, హరికృష్ణ, తదితరులు ప్రస్తావించారు. అంతకుముందు టీడీపీ సీనియర్ నేత బి.హరిప్రసాద్ కూడ మంత్రితో అన్నమయ్య ప్రాజెక్టు విశయం గురించి చర్చించినట్లు తెలుస్తోంది. ఈ సంధర్భంగా వారితో మంత్రి అన్నమయ్య ప్రాజెక్టు నిర్మాణం పనులు చేపట్టేందుకు సుదీర్ఘంగా ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ముఖ్యంగా వందల కోట్ల రూపాయల నిధులు వెచ్చించి వెంటనే ప్రాజెక్టును పూర్తి చేయలేం కదా దీని వల్ల నష్టపోతున్న వారి గురించి కూడ ఆలోచించాలి కదా దీనికంటే తక్కువ వ్యయంతో ఎక్కువ లబ్ది చేకూరేలా పనులు చేపడితే ఎలా ఉంటుందని ఆలోచిస్తున్నాం. అధికారులు కూడ ఆ పనిమీదే ఉన్నారు. ప్రాజెక్టు వెంటనే నిర్మించే పరిస్థితిపై మంత్రి నర్మగర్భ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ప్రాజెక్టు నిర్మాణం వల్ల కొన్ని మండలాలకు నష్టం వాటిల్లుతుందనే వ్యాఖ్యలు కూడ చేసినట్లు సమాచారం. అంతేకాకుండా ప్రాజెక్టు నిర్మాణం పనులు చేపట్టే విశయంలో నీటి నిల్వ సామర్థ్యం మరింత పెంచాలని డిమాండ్ ఉందని ప్రస్తావించారు. దీనికి భూ సేకరణ పర్యావరణ అనుమతుల సమస్య ఉంది. దీనికంటే ఎక్కడికక్కడ నదిలో 'అలుగులు' నిర్మిస్తే రైతులు లబ్ధిపొందుతారా అన్న ప్రతిపాదన కూడ పరిశీలనలో ఉన్నట్లు మంత్రి చెప్పుకొచ్చారు. అంతేకాకుండా ప్రాజెక్టు కొట్టుకుపోక ముందు కేంద్ర ప్రభుత్వ పథకమైన సత్వర సాగునీటి ప్రయోజన పథకం కింద ప్రాజెక్టును గతంలో పూర్తి చేశారని అదే స్కీం కింద కేంద్ర ప్రభుత్వాన్నే మరళా ఈ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని అడిగే విశయాన్ని ఆలోచిస్తున్నామని మంత్రి చెప్పారు. ప్రాజెక్టు పూర్తి చేసి నీరు నిల్వ చేస్తే ఎంత లబ్ది చేకూరుతుంది, ప్రత్యామ్నాయంగా పనులు చేపడితే అంతకంటే ఎక్కువ ప్రయోజనాలు కలుగుతాయా అన్న విశయం కూడ ఆలోచిస్తున్నట్లు మంత్రి చెప్పినట్లు తెలుస్తోంది. వరదనీటి నుంచి గ్రామాలకు రక్షణ కల్పించేందుకు ప్రొటక్షన్ వర్క్స్ మాత్రం చేపడతామని మంత్రి చెప్పినట్లు సమాచారం. చివరగా పోలవరం ప్రాజెక్టు పైనే ప్రస్తుతం ప్రభుత్వం దృష్టి పెట్టి ఉందని మిగతా ప్రాజెక్టులపై దృష్టి పెట్టే పరిస్థితి లేదని పరోక్షంగా మంత్రి వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా జిల్లా నీటి పారుదల శాఖ అధికారులు అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణానికి సంబంధించి నిపుణుల కమిటీని ఏర్పాటుచేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదన పంపారు. దీనికి తోడు కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ఇరిగేషన్ పనుల్లో 25శాతం లోపు పూర్తి కానీ వాటిని రద్దు చేసేలా జీఓ జారీ చేసి ఉంది. ఈ జీవో అమలు చేస్తే అన్నమయ్య ప్రాజెక్టు పనులు కూడ రద్దు చేసినట్లే. 787కోట్ల వ్యయంతో టెండర్లు పిలిచి పనులు చేపట్టిన గుత్తేదారు గత ప్రభుత్వం సహకరించకపోవడంతో పనులు చేపట్టలేదన్న ఆరోపణలు ఉన్నాయి. దీనికి తోడు పనులు ప్రారంభించిన రెండు నెలలకే ఎన్నికలు ముంచుకురావడంతో బిల్లుల సమస్య తలెత్తుతుందని పనులు చేసేందుకు విముఖత వ్యక్తం చేసినట్లు కూడ అధికారిక వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపధ్యంలో మంత్రి చివరగా నేతలకు సెలవు చెప్పే చివరలో ప్రస్తుతానికి గత ప్రభుత్వం హయాంలో చేపట్టిన పనులకు సంబంధించిన పరిస్థితి యదాస్థితిలో ఉందని చెప్పడం రాజంపేట ప్రాంత రైతాంగానికి కొంత వరకు ఊరటనిచ్చే అంశం. ఏదిఏమైనా అన్నమయ్య ప్రాజెక్టు నిర్మాణం ఎలా చేపడతారనే విశయం రాష్ట్ర ప్రభుత్వం విధాన ప్రకటన చేసేవరకు ఆయకట్టు రైతులు వేచిచూడాల్సిందే. పోలవరం ప్రాజెక్టుపైనే ప్రభుత్వం దృష్టంతా ఉందని చెప్పకనే చెప్పారు.

## వివిధ ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

జిల్లా పిడి, ఐసిడిఎస్ రమాదేవి

రాయచోటి, డిసెంబర్ 23 ప్రభాతవార్త



అన్నమయ్య జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లాలో వివిధ ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ కొరకు ఈనెల 24 నుండి జనవరి 02 వరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా ఐసిడిఎస్ పిడి రమాదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంగన్వాడి కార్యకర్తలు (12) అంగన్వాడి సహాయకురాలు (93) మినీ అంగన్వాడి కార్యకర్త (11) పోస్టులకు గాను దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. పోస్టులకు సంబంధించిన అర్హతలు, పూర్తి నోటిఫికేషన్ మరియు దరఖాస్తు ఫారంలకు annamayya.ap.gov.in వెబ్సైటు నుండి డౌన్లోడ్ చేసుకోనగలరు లేదా సంబంధిత ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం నుండి పొందగలరు.

## యాచకులకు దుప్పట్లు పంపిణీ

**రాజంపేట అర్బన్, డిసెంబర్ 23 ప్రభాతవార్త**

ఎముకలు కొరికే చలితో విలవిల్లాడుతున్న యాచకులు, పేదలకు రాజంపేట లైన్స్ క్లబ్ ఆపన్న హస్తం అందించింది. లైన్స్ క్లబ్ అధ్యక్షుడు నరసింహారాజు ఆధ్వర్యంలో సోమవారం పలుచోట్ల లైన్స్ క్లబ్ సభ్యులు స్వయంగా వెళ్లి దుప్పట్లను అందజేశారు. శివాలయం ,పాత బస్టాండ్, రైల్వే స్టేషన్, తదితర ప్రాంతాల్లో పేదలకు బిక్షగాళ్ళకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు పోతుగుంట రమేష్ నాయుడు,క్లబ్ సెక్రటరీ పిడికిటి సంతోష్, క్లబ్ జోన్ చైర్మన్ వై. సుబ్రహ్మణ్యం రాజు, మాజీ రీజియన్ చైర్మన్ షేక్ అబ్దుల్లా, మాజీ జోన్ చైర్మన్ నాసరుద్దీన్, లైన్స్ క్లబ్ సీనియర్ నాయకులు మలిశెట్టి సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## అర్హుల నివాసాలకు విద్యుత్ కనెక్షన్ అందించాలి

**బద్వేలు అర్బన్, డిసెంబర్ 23 (ప్రభాతవార్త) :**



పట్టణంలో అర్హులైన నివాసులకు ప్రతి ఒక్కరికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని ఏపి దళిత చైతన్య ఫోరం రాష్ట్ర అధ్యక్షులు సొద్దల పెంచలయ్య సోమవారం ఆర్డీవోకు చంద్రమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపి దళిత చైతన్య ఫోరం రాష్ట్ర అధ్యక్షులు సొద్దల పెంచలయ్య మాట్లాడుతూ బద్వేలురెవెన్యూ డివిజన్ పరిధిలోని బ్రహ్మం సాగర్ ప్రాజెక్టు కింద ముంపునకు గురైన నిర్వాసితులు, అట్లూరు, సోమశిల నుండి అనేక మంది పట్టణానికి వచ్చారని వారు నివాసం ఉండేందుకు బద్వేలు పట్టణంలో స్థలాలు కొనుగోలు చేసి వారి వారి స్థాయికి తగ్గట్లు ఇండ్లు నిర్మించుకున్నారన్నారు. ఆయా గృహాలకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని ఆర్డీవోను కోరారు. విద్యుత్‌కనెక్షన్ కావాలంటే ఎన్ ఓసీ కావాలని విద్యుత్‌శాఖాదికారులు కనెక్షన్లు ఇవ్వకుండా కాలక్షేపం చేస్తున్నారని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎన్‌ఓసీలతో సంబందం లేకుండా విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయాలని కోరారు. గతంలో ఈ పద్ధతి ఉండేది కాదని కొంతమంది అధికారులు తెచ్చిన చట్టాలతో ఇవి పుట్టుకొచ్చాయన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని ఎన్‌వోసీ పద్ధతి బద్వేలులో మాత్రమే కొనసాగించడం బాధాకరమని, ఇది అర్హులైన ముంపువాసులకు ఇబ్బంది కలిగించే అంశమని పేర్కొన్నారు. కావున ఇప్పటికైనా ఆర్డీవో స్పందించి అర్హులైన వారికి విద్యుత్ కనెక్షన్లు అందించేలా ఆ శాఖ సిబ్బందికి సూచించాలని కోరారు. ఈయన వెంట వెంకటరమణ, చెన్నయ్యలతో పాటు పలువురు దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## రూ.30లక్షలతో అభివృద్ధి పనులు



**నిమ్మనపల్లె, డిసెంబర్ 23 ప్రభాతవార్త :**

జిల్లాలో పేరుపొందిన బాహుదాకు రూ.30లక్షలతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం రాత్రి ఆయన బాహుదా ప్రాజెక్టు వద్దకు చేరుకొని స్టేట్ డిసోడిఎన్ ఫండ్ (ఎస్డఎఫ్ఎఫ్)ద్వారా మంజూరు అయిన పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ళలో వైసిపి బాహుదాకు ఒక్క రుపాయి ఖర్చు చేయలేదని కనీసం గేట్లుకు గ్రీసుకూడా వేయించలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని బాహదాకు కావాల్సిన జనరేట్ రూము నిర్మాణంతో పాటు నూతన జనరేటర్‌ను ఏర్పాటు, జంగల్‌క్లీరన్స్ తదితర పనులు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బాహుదా సాగునీటిసంఘ అధ్యక్షులు దేవేంద్రరెడ్డి, మాజీ పార్టీ మండల అధ్యక్షులు రాజన్న, పార్లమెంటు బిసి అధికార ప్రతినిధి లక్ష్మన్న, నాయకులు చంద్రాయుడు, కాంట్రాక్టర్ శ్రీనివాసులురెడ్డి, శంకరయ్య (ఏఫ్ఏ), ప్రభుత్వాసుపత్రి మాజీ ఛైర్మెన్ శ్రీపతి తదితరులు పాల్గొన్నారు.

## క్రిస్మస్‌కు ముస్తాబైన ప్రార్థనా మందిరాలు

**రామసముద్రం, డిసెంబర్ 23 ప్రభాతవార్త :**

మండలంలో క్రిస్మస్ వేడుకలకు ప్రార్థనా మందిరాలు ముస్తాబవుతున్నాయి. ఏసుక్రీస్తు పుట్టినరోజు వేడుకలకు ముస్తాబు అయ్యాయి. మండలంలోని పెనుమోలు ప్రార్థన మందిరం, ప్రేమస్వరూపి ప్రార్థన మందిరం, బేతస్త, బేబతేఉ, సియోస్, ఏసుక్రీస్తు వందల ఏళ్ళనాటి చరిత్ర కలిగిన కర్నాటక బార్డర్‌లో ఉన్న గూకుంట గ్రామంలో వెలసి ఉన్న సాంటా ప్రాన్సీస్ క్లెవియర్ చర్చ్‌లో దీపాలంకరణ చేశారు. రెల్లిగడ్డితో పాకనిర్మించి విగ్రహాలను ఏర్పాట్లు చేశారు. గూకుంట చర్చికి ఇతర రాష్ట్రాల నుంచి ప్రార్థనా మందిరానికి వస్తారని గూకుంట గ్రామస్థులు తెలిపారు. క్రిస్మస్ పండుగకు సామాగ్రి కొనేందుకు ముందకు వెలుతున్నారు. ఏది ఏమైనా క్రిస్మస్ పండగకు ప్రార్థనా మందిరాలు ముస్తాబు అవుతున్నాయి.

## రైతులందరి చూపు ప్రకృతి వ్యవసాయం వైపు ఉండాలి

**ఓబులవారిపల్లె, డిసెంబరు 23, ప్రభాతవార్త:**



అందరి చూపు ప్రకృతి వ్యవసాయం వైపు ఉంటే ప్రజల ఆరోగ్యం ఎంతో సుఖాంతంగా ఉంటుందని తహసీల్దార్ శ్రీధర్‌రావు సూచించారు. సోమవారం మండల కేంద్రమైన ఓబులవారిపల్లె తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో అగ్రికల్చర్ అధికారి మల్లిక ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రకృతి వ్యవసాయంతో పండించిన పంటలను కూరగాయలను ప్రదర్శనశాలను ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల ఎన్నో లాభాలు, ఉపయోగాలున్నాయని ప్రకృతి వ్యవసాయ ప్రకృతి అందించే వరప్రసాదమని ఎటువంటి రోగాలు లేకుండా సేంద్రియ ఎరువులు, కషాయాలతో పంటలు పండించి అంతర పంటల వల్ల చిరుధాన్యాలు ఉత్పత్తి చేసుకొని ఆహారపు అలవాట్లు మార్చుకుంటే ప్రజలు ఎంతో ఆరోగ్యంగా ఉంటటారన్నారు. ఏవో మల్లికా మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని ప్రకృతి వరప్రసాదిని అని ప్రజలకు ఒక వరమని ఈ అవకాశాలను రైతులందరూ సద్వినియోగం చేసుకొని అధికారుల సూచనల మేరకు పంటలు పండించి ఎరువులు సొంతంగా తయారు చేసుకొని వాడితే అధిక లాభాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మల్‌రెడ్డి, పీఓపీఆర్డీ వెటర్నరీ డా.నాగవేణి, అగ్రికల్చర్ అధికారులు, ఎంసీఏ బుల్లయ్య, మధు, శివ, సిబ్బంది, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## శోకసంద్రంలో మునిగిన రెండు నియోజకవర్గ బంధుమిత్రులు

**ఓబులవారిపల్లె, డిసెంబరు 23, ప్రభాతవార్త:**



మానవ జీవితం నీటి బుడుగ లాంటిదని రాత్రి పడుకుంటే ఉదయం లేచే వరకు ఎవరు గ్యారెంటీ కాదనే నగ్న సత్యం అని తెలుస్తోంది. ఓబులవారిపల్లె మండలం వై.కోట గ్రామంలో సుజాత కుటుంబం వారి అమ్మ వారింటికి వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంలో సుజాత భర్త నరసింహులు వారి ఇద్దరు పిల్లలు రాజంపేట భువనగిరిపల్లెకు బయలుదేరారు. ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో బయలుదేరారు. ఓబులవారిపల్లె మండలం రెడ్డిపల్లి చెరువు కట్ట వద్ద మృత్యు రూపంలో ఆటో వారి ద్విచక్ర వాహనం ఢీకొనడంతో నరసింహులు మృతి చెందాడు. ఆయన భార్య సుజాత తీవ్ర గాయాలతో ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందారు. వారి ఇద్దరు పిల్లలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం తరలించారు. భార్యభర్తల మృతితో ఒరెండు గ్రామాల్లో విషాధ ఛాయలు అలుముకున్నాయి. బంధువుల, మిత్రుల రోధనలతో మిన్నంటాయి. రాజంపేట నియోజకవర్గం నుంచి వందల సంఖ్యలో మృతదేహాలకు నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఏది ఏమైనా రోడ్డు ప్రమాదాలపై జాగ్రత్తగా ఉండాలని రోడ్డు మరమ్మతులు కూడా చేయించి ప్రజల ప్రాణాలు కాపాడాలని అటు అధికారులను, ఇటు పాలకులను ప్రజలు కోరుతున్నారు.

## రత్నం ఇంగ్లీషు మీడియం పాఠశాలలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు

**బద్వేలు అర్బన్, డిసెంబర్ 23 (ప్రభాతవార్త) :**









పట్టణంలోని మహబూబ్‌నగర్‌లోని రత్నం ఇంగ్లీషు మీడియం పాఠశాలలో సోమవారం పాఠశాల కరస్పాండెంట్ తలారి రత్నం ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పీఎస్ ఆర్ బిల్డర్స్ అండ్ ఫౌండేషన్ యజమాని పెసలనాగరాజుకు సాదరంగా ఆహ్వానం పలికి శాలువా, పూలమాలలతో సత్కరించి మెమెంటో అందజేసి పీఎస్ ఆర్ ఫౌండేషన్ సేవలను తలారి రత్నం అభినందించారు. ఈ సందర్భంగా పెసల నాగరాజ మాట్లాడుతూ బద్వేలు పట్టణంలో అనేక సంవత్సరాలుగా రత్నం విద్యాసంస్థ నిర్వహిస్తూ ఆయా విద్యార్థుల ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా కొంతమందికి ఉచిత విద్యను, మరికొంతమంది నామమాత్రపు ఫీజులు తీసుకుంటూ తన మానవత్వాన్ని చాటుకుంటున్నారని, తానుకూడా ఈ పాఠశాల విద్యార్థిని కావడం తనకెంతో గర్వంగా ఉందన్నారు. నాటి నుంచి నేటి వరకు ఎంతోమంది ఇక్కడ విద్యనభ్యసించిన విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకుని మంళా పాఠశాలకు వచ్చి పాఠశాలకువచ్చి పాఠశాలతో తమకున్న అనుబంధాన్ని తెలియజేస్తుంటారని, ఈ పాఠశాల సేవలు కలకాలం కొనసాగాలని ఆకాంక్షించారు. అనంతరం రత్నం మాట్లాడుతూ పీఎస్ ఆర్ ఫౌండేషన్ పెసల నాగరాజ గత 10 సంవత్సరాలుగా బద్వేలు ప్రాంతంలోనే కాకుండా ఇతర జిల్లాలోని నిరుపేదలకు, మరియు ఆధ్యాత్మకంగా ఆలయాలకు వారివంతు సహాయ సహకారాలు అందిస్తూ పీఎస్ఆర్ ఫౌండేషన్ సేవలు రాష్ట్ర స్థాయిలో అందించడం గొప్ప విషయమన్నారు. బద్వేలు ప్రాంతంలో పోలీసుస్టేషన్‌కు బ్లూకోట్ స్కూటర్, మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు, ఇద్దరి పేద విద్యార్థులను సొంతంగా చదివించి వారి విద్యాభివృద్ధికి పాటుపడిన గొప్ప వ్యక్తి పెసల నాగరాజ అని ఆయన సేవలను కొనియాడారు. అనంతరం క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని క్రీస్తు యొక్క గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. అలాగే విద్యార్థుల ద్వారాక్రీస్తు జననంపై మరియు క్రిస్మస్ గొప్పతనంపై పలు సాంస్కతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పలువురు క్రైస్తవులకు పెసల నాగరాజ ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షల తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బయ్య, తోటరాము, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళల ఆర్థికాభివృద్ధికి మా పూర్తి సహకారం

**తంబళ్లపల్లె, డిసెంబరు 23, ప్రభాతవార్త:**



తంబళ్లపల్లె మండలంలోని మహిళా సంఘాలు ఆర్థికాభివృద్ధి సాధించడానికి మా పూర్తి సహకారం ఉంటుందని ఇండియన్ బ్యాంక్ మేనేజర్ హరినాథ్ గుప్తా హామీ ఇచ్చారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మహిళా సంఘాల సమీక్షలో ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాలకు గత ఏడాది విరివిగా రుణాలు పంపిణీ చేశామన్నారు. ఈ ఏడాది అర్హులైన గ్రూపులు రుణ సౌకర్యం పొందాలని మహిళా సంఘాలకు రూ.20కోట్లు రుణాల పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఏపీఎం గంగాధర్ మాట్లాడుతూ ఈ వారంలో మండలంలోని 30 మహిళా సంఘాలకు రూ.5కోట్లు రుణాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఇంకా అర్హులైన మహిళా సంఘాలు రుణ సౌకర్యం కోసం ముందుకు రావాలని గతంలో రుణం పొంది మరింత రుణం కావాలనుకునే వారికి కూడా రుణాలు పంపిణీకి ఇండియన్ బ్యాంక్ మేనేజర్ సహకరిస్తున్నట్లు కొనియాడారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మహిళా సంఘాలు రుణాలు పొంది పాడి పరిశ్రమ, చిన్న చిన్న వ్యాపారాలతో ఆర్థికాభివృద్ధి సాధించి తిరిగి రుణాలు చెల్లించి తమతో పాటు తమ కుటుంబ భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ బ్యాంక్ ఆఫీసర్ నిహార్ అహ్మద్, మండల సమైక్య అధ్యక్షురాలు రామలక్ష్మి, హౌసింగ్ ఏఈ సుజాత, సీసీలు నరసింహులు, రమణ, ఆదిలక్ష్మి, మండలంలోని మహిళా సంఘాలు పాల్గొన్నారు.

## తంబళ్లపల్లెలో దోమల నివారణకు ఫాగింగ్

**తంబళ్లపల్లె, డిసెంబరు 23, ప్రభాతవార్త:**



తంబళ్లపల్లె మండల కేంద్రంలో గత కొన్ని రోజులుగా విపరీతంగా దోమలు ప్రబలి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో ఉపేందర్‌రెడ్డి, ఈవోఆర్డీ దిలీప్‌కుమార్ నాయక్‌లు స్పందించి వెంటనే మండల కేంద్రంలో దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలని కార్యదర్శి రామకృష్ణను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కార్యదర్శి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని మెయిన్ బజారుతో పాటు ప్రధాన వీధులు, ప్రభుత్వ ఆసుపత్రి, సంక్షేమ హాస్టళ్ల, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ముమ్మరంగా ఫాగింగ్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యాలయ సిబ్బంది పద్మావతి, భాస్కర తదితరులు పాల్గొన్నారు.

## సంఘ ఛైర్మన్ల అధ్యక్షుడుగా శివకుమార్

**తంబళ్లపల్లె, డిసెంబరు 23, ప్రభాతవార్త:**

తంబళ్లపల్లె మండల చెరువు సంఘ ఛైర్మన్ల సంఘ అధ్యక్షుడుగా పెద్దేరు ప్రాజెక్టు ఆయకట్టు ఛైర్మన్ కొట్టాల శివకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మండల పార్టీ అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి తెలిపారు. సోమవారం ఐకేపీ కార్యాలయంలో రెడ్డప్పరెడ్డి ఆధ్వర్యంలో కమిటీ ఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షుడు బయమ్మ చెరువు అధ్యక్షుడు సిద్దుమల్‌రెడ్డి, మెంబర్లుగా రామలింగారెడ్డి, శివకుమార్ నాయుడు, జైహింద్‌రెడ్డి, చిన్నరెడ్డప్ప, మదన్‌మోహన్‌రెడ్డిలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కొటాల శివకుమార్ మాట్లాడుతూ మండలంలోని ఆయకట్టు చెరువుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అదే విధంగా పెద్దేరు ప్రాజెక్టు, చిన్నేరు ప్రాజెక్టులను పర్యాటక కేంద్రాలుగా ఏర్పాటుకు మంత్రి సహకారంతో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తులసీధర్ నాయుడు, మాజీ సర్పంచ్ సిద్దమల్‌రెడ్డి, శివరాం, రామచంద్రారెడ్డి, జగదీష్, రాధాశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గణిత దినోత్సవ వేడుకలు

**సిద్దవటం, డిసెంబరు 23, ప్రభాతవార్త:**





సిద్దవటం జిల్లా పరిషత్ హైస్కూలు నందు గణిత అధ్యాపకులు, కీర్తిశేషులు, శ్రీనివాస రామానుజన్ జన్మదిన సందర్భంగా గణిత దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శ్రీరాములు మంగళవారం మాట్లాడుతూ గణిత అధ్యాపకులు శ్రీనివాస రామానుజన్ 137వ జన్మదిన సందర్భంగా ఘనంగా వేడుకలు జరిపామని విద్యార్థినీ విద్యార్థులకు వ్యాసరచన, గణిత టాలెంట్ ఎడ్యుకేషనల్‌లో ఉత్తీర్ణత సాధించిన వారికి బహుమతులు అందించి అభినందించామని, బదిలీపై బద్వేలు వెళ్లిన జూనియర్ అసిస్టెంట్ సుభాషిణికి ఘనంగా సత్కరించి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో స్కూలు కమిటీ ఛైర్మన్ నాగార్జున, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ హైస్కూల్ ఆకస్మిక తనిఖీ

**సిద్దవటం, డిసెంబరు 23, ప్రభాతవార్త:**



సిద్దవటం మండలంలోని భాకరాపేట గ్రామం జిల్లా పరిషత్ హైస్కూల్‌ను సోమవారం రీజనల్ జాయింట్ డైరెక్టర్, ఎడ్యుకేషనల్ అధికారి శ్యాముల్ రావు సోమవారం ఆకస్మిక తనిఖీ చేసి సిబ్బంది వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల ఆన్‌లైన్, హాజరు నమోదు, సమయపాలన దిశగా ఉండాలని విద్యార్థినీ విద్యార్థులు, పదో తరగతి ఉత్తీర్ణత శాతం పెంచేలా కృషి చేయాలన్నారు. మెనూ నాణ్యతలోపం ఉంటే చర్యలు తప్పవని విద్యార్థుల ఆట స్థలం గురించి ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరలో నిర్ణయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్మాస్టర్ లక్ష్మీ కేసమ్మ, పీఈడీ ఉపాధ్యాయుడు రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్ క్యాంపులు సద్వినియోగం చేసుకోండి

**చాపాడు, డిసెంబర్ 23, ప్రభాతవార్త:**



మండలంలోని ఎన్.ఓబాయపల్లి గ్రామ సచివాలయంలో 26వ తేదిన సోమాపురం, 27న పెద్ద గురువలూరు, 28తేదీలలో గ్రామ సచివాలయాలలో ఆధార్ క్యాంప్ నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏ.వీరకిశోర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరం నందు ఆధార్‌లో మార్పులు, చేర్పులతో పాటు కొత్తగా ఆధార్ నమోదు ప్రక్రియ చేయనున్నట్లు తెలిపారు. కావున ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన విజయవంతం

**కలికిరి, డిసెంబరు 23, ప్రభాతవార్త:**



కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మహానంది వ్యవసాయ కళాశాల 4వ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు సోమవారం నిర్వహించిన రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమం విజయవంతమైంది. మహానంది వ్యవసాయ కళాశాల విద్యార్థులు 3 నెలలు శిక్షణ కార్యక్రమంలో భాగంగా కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో కలికిరి మండలంలోని పంచాయతీలలో, పీలేరు మండలం బాలంవారిపల్లె పంచాయతీలలో గత 3 నెలలుగా వ్యవసాయం, అనుబంధ రంగాలపై అవగాహన పొందారు. సోమవారం బాలవారిపల్లె పంచాయతీలో రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డా.మంజుల అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ డా.మంజుల మాట్లాడుతూ డ్రోన్ల వినియోగం, జీవ శిలీంద్రాల వాడకాన్ని ముందుకు తీసుకెళ్లాలన్నారు. వ్యవసాయాన్ని పరిశ్రమలలాగా చేపట్టి అధిక దిగుబడులు వచ్చేలా అభివృద్ధి పరచాలన్నారు. పీలేరు వ్యవసాయ సహాయ సంచాలకులు డా.వై.వీ రమణారావు సమీకృత వ్యవసాయం, మరియు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మహానంది వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.పవన్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతు సదస్సు వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమం నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శనల పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు పీరూసాహెబ్, శ్రీనివాసులు, డా.మధుశ్రీ, పశువైద్య శాఖ శాస్త్రవేత్త డా.నవీన్, పలువురు రైతులు, కృషి విజ్ఞాన కేంద్రం రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వంట ఏజెన్సీ మార్పునకు ఏకగ్రీవ తీర్మానం

**సిద్దవటం, డిసెంబరు 23, ప్రభాతవార్త:**



మండలంలోని భాకరాపేట సమీపాన ఏపీఎస్పీ 11వ పోలీసు పటాలం జిల్లా పరిషత్ హైస్కూలులో సోమవారం విద్యా కమిటీ సమావేశం నిర్వహించి వంట ఏజెన్సీ మార్పునకు పిల్లల తల్లిదండ్రులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. సమావేశంలో ఛైర్మన్ హరికృష్ణ మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులకు ప్రతి రోజు అందించే భోజనం నాణ్యత లోపం గుర్తించి నూతన వంట ఏజెన్సీ వారిని ఎన్నుకున్నామని, ఇది వరకే జిల్లా అధికారులు మండల అధికారులు నాణ్యత లోపం ఉందని గుర్తించారన్నారు. హెడ్మాస్టర్, నాగమునిరెడ్డి మాట్లాడుతూ 16 మంది విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారని విద్యాశాఖాధికారికి నివేదిక పంపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అన్నదానం మహా పుణ్యకార్యం

**చాపాడు, డిసెంబర్ 23, ప్రభాతవార్త:**



అన్ని దానాల కన్నా అన్నదానం మహా పుణ్యకార్యం అని టిడిపి నాయకులు, సేవా ప్రముఖులు పెరుగు వీరనారాయణ యాదవ్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని అల్లాడుపల్లె వీరభద్ర స్వామి దేవస్థానానికి భక్తులు వివిధ ప్రాంతాల నుండి విచ్చేశారు. శ్రీ స్వామివారిని, అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్ర స్వామి అన్నదాన సత్రం నందు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి బద్రిపల్లె గ్రామ వాస్తవ్యులు తిప్పలూరు శివారెడ్డి వీరి ధర్మపత్ని పార్వతి వీరి కుమారుడు తిప్పలూరు బాల వీరారెడ్డి వీరి ధర్మపత్ని వర్షిత వారి కుటుంబ సభ్యులు జరిపించారు. అదేవిధంగా ఈ కార్యక్రమానికి ప్రతి సోమవారం మినరల్ వాటర్ గుంత చీపాడు గ్రామ వాస్తవ్యులు రామాంజినేయులు రెడ్డి ఉచితంగా అందజేస్తున్నారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా అన్నదానం చేయదలచిన వారు ముందుగా వారి పేర్లు నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అన్నవరం సుధాకర్ రెడ్డి, అల్లాడుపల్లె టిడిపి నాయకులు పెరుగు వీరనారాయణ యాదవ్, దేవస్థాన మాజీ ఛైర్మెన్ వీరారెడ్డి, టిడిపి నాయకులు వై.వెంకటేశ్వర్ రెడ్డి, ఆర్.వీరారెడ్డి, జి.వీరారెడ్డి, కేతవరం ప్రతాప్, బద్రిపల్లె సర్పంచ్ గుత్తి మల్లీశ్వరి, ఆమె భర్త టిడిపి యువ నాయకులు గుత్తి వీరనారాయణ యాదవ్, గుత్తి కిశోర్ యాదవ్, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దొంతు సుబ్రహ్మణ్యం, దేవస్థానం కార్యనిర్వాహణాధికారి మేకల మారుతీ ప్రసాద్ యాదవ్, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అర్జీదారులకు సత్వర పరిష్కారం చూపాలి

**దువ్వూరు, డిసెంబర్ 23, ప్రభాతవార్త:**



ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చే వివిధ రకాల సమస్యలపై సత్వర పరిష్కారం చూపాలని తహసీల్దార్ ఇక్బాల్ బాష, ఎంపీడీఓ రామకృష్ణలు అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యలు పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్కువ మంది అర్జీదారులు వచ్చి తమ సమస్యలను విన్నవించుకున్నారు. వాటిని పరిష్కరించాలని వివిధ శాఖల అధికారులకు అందజేశారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ మండల స్థాయిలోనే సమస్యలు పరిష్కారం అయితే జిల్లా స్థాయికి వెళ్లకుండా ఉంటారని అందువల్ల ఇక్కడే పరిష్కరించే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈలు సుబ్రమణ్యం, శివకుమార్, డిప్యూటి తహసీల్దార్ కరీముల్లా, వేణుగోపాల్ పాల్గొన్నారు.

## నేడు కానగూడూరులో రెవెన్యూ సదస్సు

**దువ్వూరు, డిసెంబర్ 23, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని కానగూడూరులో గ్రామ సచివాలయం నందు మంగళవారం రెవెన్యూ సదస్సును నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఇక్బాల్ బాష తెలిపారు. ఈ రెవెన్యూ సదస్సు రామచంద్రాపురం రెవెన్యూ గ్రామానికి చెందిన భూమి సమస్యలపై ధరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని రామచంద్రాపురం గ్రామ రైతులు వినియోగించుకోవాలని తెలిపారు.

## ఆలయ అధ్యక్షుడిగా సింగరయ్య ఎన్నిక

**బద్వేల్ అర్బన్, డిసెంబర్ 23 (ప్రభాతవార్త):**

బద్వేల్ పట్టణం నెల్లూరు రోడ్ లో గల శ్రీకృష్ణ మందిరం ఆలయ అధ్యక్షుడిగా జట్టిబోయిన సింగరయ్య యాదవ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన వంతు సహకరిస్తారన్నారు.

## ఘనంగ వైఎస్సార్‌సీపీ నాయకులు ఇరగంరెడ్డి నాగేశ్వరరెడ్డి జన్మదిన వేడుకలు

**ఖాజీపేట, డిసెంబర్ 23, ప్రభాతవార్త:**

ఖాజీపేట వైఎస్సార్‌సీపీ నాయకులు ఇరగం రెడ్డి నాగేశ్వర రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఖాజీపేట మండల పరిధిలోని రహమత్ ఖాన్ పల్లి వాస్తవ్యులు అయిన వైయస్సార్ కాంగ్రేస్ పార్టీ నాయకులు ఇరగంరెడ్డి నాగేశ్వర రెడ్డి చిన్న వయస్సు లోనే సామాజిక స్పృహతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ నిత్యం ప్రజల్లో అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుంటూ, ముఖ్యంగా పుల్లూరు పంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి పూర్తి చేసిన, కార్యకర్తలకు చేయూతనిస్తూ మంచి మనసున్న నాయకునిగా, వ్యాపారవేత్తగా ప్రజల మన్ననలు పొందుతున్నారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని మాజీ ఏపీఐఐసీ డైరెక్టర్ దుగ్గిరెడ్డి గంగాధర్ రెడ్డి, ఖాజీపేట-1 ఎంపీటీసీ జంగిటి శివప్రసాద్, వార్డు సభ్యులు గుజ్జల మురళీ, వెల్కమ్ ఫోటో స్టూడియో అధినేత తాతిరెడ్డి బ్రహ్మానంద రెడ్డి, ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ మూలే శ్రీనాథరెడ్డిలు ఆయన స్వగృహంలో కలిసిరు.



## కంప్యూటర్ రంగంలోనే ఉద్యోగ అవకాశాలు

### ఆదిత్య కళాశాల డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి

**మదనపల్లె, డిసెంబర్ 23 ప్రభాతవార్త :**



కంప్యూటర్ సైన్స్‌లో అభివృద్ధి చెందుతున్న రంగాల్లో రాణిస్తే ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయని ఆధిత్య ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి తెలిపారు. ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో ఐబిఎం స్కిల్స్ బిల్డ్ ప్రోగ్రామ్‌పై వారం రోజులు పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తొంది. ఏపి స్టేట్ స్కిల్ డెవలప్‌మెంటు కార్పోరేషన్, ఎడ్యూనెట్ పౌండేషన్ సహకారంతో ఈసిఈ, సిఎస్ఈ, సిఎస్ఈ-ఏ1, ఏ1 అండ్ డిఎస్ బ్రాంచ్‌ల రెండవ సంవత్సర విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, మెస్సింగ్ లర్నింగ్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 350మంది విద్యార్థులు శిక్షణా కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సతీష్‌బాబు, ఐబిఎం స్కిల్ బిల్డ్ ప్రోగ్రామ్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఓడిలు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## ఎస్పిని కలిసిన ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

**మదనపల్లె, డిసెంబర్ 23 ప్రభాతవార్త :**



జిల్లా ఎస్పి విద్యాసాగర్ నాయుడును మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా కలసి శాలువతో సన్మానించారు. సోమవారం ఎస్పి కార్యాలయంలో ఎమ్మెల్యే ఎస్పిని కలిసి నియోజకవర్గంలో నెలకొన్న శాంతిభద్రతలు, ట్రాఫిక్ గురించి చర్చించినట్లు తెలిపారు. పట్టణంలో ప్రధానంగా ట్రాఫిక్ సమస్య నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూడా ఎస్పి దృష్టికి తెచ్చినట్లు తెలిపారు. ఎమ్మెల్యే వెంట తెలుగుదేశం పార్టీ రాష్ట్ర సెక్రటరీ గాజుల శివరామ్‌ప్రతాప్ పాల్గొన్నారు.

## నిరుపయోగంగా మున్సిపల్ పార్కులు

**మదనపల్లె, డిసెంబర్ 23 ప్రభాతవార్త :**



పట్టణంలోని మున్సిపల్ పార్కులు నిరుపయోగంగా ఉంటూ అసాంఘీక కార్యక్రమాలకు నిలయంగా ఉన్నాయని బివైఎస్ అధ్యక్షులు పునీత్ మున్సిపల్ మేనేజర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల విభాగం కార్యక్రమంలో భాగంగా బహుజన యువసేన అద్వర్యంలో ఆయన మున్సిపల్ మేనేజర్ మనోహర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పునీత్ మాట్లాడుతూ ప్రభుత్వం పట్టణాల్లో కమ్యూనిటీ సాధారణ విశ్రాంతి కోసం, నీటి కాలుష్యం నుండి పట్టణాలను రక్షించడం కోసం మున్సిపల్ పార్కులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అయితే పట్టణంలో ఉన్న మున్సిపల్ పార్కులు గత కొన్నాళ్ళుగా నిరుపయోగంగా ఉంటూ ఆసాంఘీక కార్యక్రమాలకు నిలయంగా మారాయన్నారు. పార్కుల వద్ద శాంతిభద్రతలు కూడా లోపించాయన్నారు. పార్కుల మార్గంలో మహిళలు వెళ్ళాలంటేనే భయబ్రాంతులకు గురువుతున్నారన్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న పార్కులను ఉపయోగంలోకి తేవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, ఆది, శశికుమార్, వినయ్, శివకుమార్, తారక్, ఉదయ్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి



**మదనపల్లె, డిసెంబర్ 23 ప్రభాతవార్త :**

మదనపల్లె మున్సిపాలిటిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు తక్షణమే చెల్లించాలని ఏపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సురేష్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్బంగా సురేష్ కుమార్ మాట్లాడుతూ పండగ పూట కూడా వేతనాలు లేకుండా కార్మికులు పస్తులు ఉంటున్నారని తెలిపారు. పట్టణంలో ప్రజలకు అంటురోగాలు ప్రబలకుండా పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులకు ప్రతినెలా జీతాలు చెల్లించడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మస్తాన్, ఉపాధ్యక్షురాలు ఇంద్రాణి, యూనియన్ నాయకులు వంశీ,శ్రీనివాసులు, శేఖర్, రేణుక, అనూరాధ, రెడ్డమ్మ, లక్ష్మిదేవి, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## మిట్స్‌లో ఘనంగా రామానుజన్ జయంతి

**కురబలకోట, డిసెంబర్ 23 ప్రభాతవార్త :**



మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం రామానుజన్ జయంతిని నిర్వహించారు. రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల విభాగాదిపతి డాక్టర్ రమేష్‌రడెడ్డి మాట్లాడుతూ గణిత శాస్త్రానికి శ్రీనివాస రామానుజన్ చేసిన సేవలు మరువలేనివన్నారు. గణితశాస్త్ర పితామహుడిగా పేరుతెచ్చుకొన్న ఆయన బాటలో ప్రతి ఒక్కరూ పయనించాలన్నారు. అత్యంత చిన్నవయసులోనే గణితశాస్త్రంలో తనకున్న పట్టును చాటుకొన్న రామానుజన్ మ్యాథ్స్ జీనియస్ చరిత్రలో నిలిచిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో ఫస్ట్‌ఇయర్‌కోఆర్డినేటర్ డాక్టర్ సుబ్బారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్థిక మాంత్రికుడు స్వర్గీయ పి.వి.నరసింహా రావు

**వేంపల్లి, డిసెంబరు 23, ప్రభాతవార్త :**



భారత స్వాతంత్ర్య సమర యోధుడు, భారత మాజీ ప్రధాని స్వర్గీయ పి.వి.నర సింహారావు ఆర్థిక మాంత్రికుడని, ఆర్థిక సంస్కరణల ద్వారా దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించారని రాజ్య సభ మాజీ సభ్యులు, ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసిరెడ్డి కొనియాడారు. సోమవారం వేంపల్లి లో పి.వి.నరసింహా రావు 20వ వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ స్వర్గీయ పి.వి బహుముఖ ప్రజ్ఞాశాలి,బహు భాషా కోవిదుడు,పరిపాలనా ధక్షుడని శ్లాఘించారు. వర్ధంతి కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సుబ్రమణ్యం, రామకృష్ణ, వేమా రాజా, చెన్నకేశవ, అమర్‌నాథ్‌రెడ్డి, ఉత్తన్న, వెంకటేష్, మహబూబ్ బాషా, మదార్, నాగ రాజు, రవి, వినయ్, సుబ్బరాయుడు, బద్రి ,ఐచర్ రమణ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ గణిత దినోత్సవం, ప్రదర్శన

**వేంపల్లి, డిసెంబరు 23, ప్రభాతవార్త :**



వేంపల్లి శ్రీ చైతన్య హై స్కూల్‌లో జాతీయ గణిత దినోత్స వాన్ని పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక కార్యక్రమాలు, ప్రదర్శనలు ఘనంగా నిర్వహించబడాయి. విద్యార్థులు తమ సృజనాత్మకతను ప్రదర్శిస్తూ గణితంతో సంబంధమైన అనేక మోడళ్లు, ప్రాజెక్టులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల చైర్మన్ బి.చక్రపాణి రెడ్డి, శ్రీనివాస రామానుజన్ జీవిత చరిత్రను , గణిత శాస్త్ర ప్రాధాన్యాన్ని వివరించారు. గణితం ద్వారా ప్రపంచాన్ని ఎలా అర్థం చేసుకోవచ్చో, విద్యార్థులు దానికి అనుగుణంగా తమ భవిష్యత్తును ఎలా నిర్మించుకోవచ్చో ప్రసంగించారు. విద్యార్థులు రూపొందించిన ప్రదర్శనలను మేనేజింగ్ డైరెక్టర్స్ చేతన్ రెడ్డి , చైతన్య రెడ్డి సందర్శించి విద్యార్థులను, ప్రాజెక్ట్ లను గురించి వివిధ ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారుఖి. గణిత శాస్త్రంపై పిల్లల్లో ఆసక్తి పెంచేందుకు ఈ ప్రదర్శన ముఖ్యమైన వేదికగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి ఉపాధ్యాయుల సహకారం, విద్యార్థుల కృషి కీలకమైందని పాఠశాల కరస్పాండెంట్ తెలిపారు.

## నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

**బద్వేల్ అర్బన్ డిసెంబర్ 23 : ప్రభాతవార్త :**

వాహనదరులు ప్రతి ఒక్కరు నిబంధనలు పాటించి ట్రాఫిక్ అంతరాయం కలవకుండా వాహనదారులు సహకరించాలని బద్వేలు అర్బన్ సీఐ రాజగోపాల్ తెలిపారు, సోమవారం సాయంత్రం పలు ప్రధాన రహదారులలో వాహనాలు తనిఖీలు చేపట్టిన సిఐ రాజగోపాల్ మాట్లాడుతూ వాహనదారులు ప్రతి ఒక్కరు తగిన జాగ్రత్తలు పాటిస్తూ సురక్షితంగా గమ్యం చేరుకునేలా ఉండాలన్నారు, మద్యం సేవించి సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం చట్టరీత్య నేరమన్నారు అలాగే మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలన్నారు, అలాగే రోడ్లపై ఆటోలు ఎక్కడపడితే అక్కడ నిలిపి ట్రాఫిక్ అంతరానికి పాల్పడితే జరిమానా తప్పదన్నారు, వాహనాలకు సంబంధించిన రికార్డులు డ్రైవింగ్ లైసెన్స్ ఇన్స్యూరెన్స్, పొలిషన్ మరియు పలు పత్రాలు సక్రమంగా ఉండేలా వాహనాలు దారులు సరిచూసుకోవాలన్నారు, అనంతరం వాహనదారులకు పలు రకాలు సలహాలు సూచనలు ఇచ్చారు ఈ వాహనాల తనిఖీలలో ఏఎస్ఐ నాయక్ పోలీస్ సిబ్బంది గోపాలకృష్ణ హోంగార్డు సుధాకర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు



## అక్రమ మైనింగ్ అరికట్టాలని ఫిర్యాదు

**కెవిపల్లి డిసెంబర్ 23 ప్రభాతవార్త ః**

మండలంలోని తీతవ గుంట పల్లి పంచాయతీ అడవి పల్లె సమీపంలో అక్రమంగా జరుగుతున్న వాళ్ళ మైనింగ్ అరికట్టాలని టిఎల్ వెంకటేష్ సోమవారం అమరావతిలో సీఎం క్యాంప్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు అక్రమంగా రాళ్లు కొట్టడం వల్ల ప్రాజెక్టుకు నష్టం జరిగే అవకాశం ఉందన్నారు ఇప్పటికే పలమార్లు జిల్లా కలెక్టర్ మైనింగ్ అధికారులకు తెలిపిన స్పందించడం లేదని ఫిర్యాదుల పేర్కొన్నారు ఉన్నతాధికారులైన స్పందించి అక్రమ మైనింగ్ అరికట్టాలని కోరారు.

## కిషోరి వికాసం బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది



**చిట్వేలి, డిసెంబర్ 23, ప్రభాతవార్త:**

కిశోరి వికాస కార్యక్రమం బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తుందని, ఉజ్వల ఆరోగ్యకరమైన ప్రగతి దిశగా ఆమె వేసే అడుగుకు సమిష్టి కృషితో మనమంతా చేయూతనివ్వాలని చిట్వేలి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిని నిర్మలా జ్యోతి అన్నారు. సోమవారం స్థానిక ఎంపిడిఓ సభా భవనంలో ఐసిడిఎస్ సిబ్బందికి, వెలుగు వివోలకు, మహిళా కార్యదర్శులకు కిశోరి వికాసంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ మాట్లాడుతూ బాలిక విద్య, ఆరోగ్యం, పోషకాహారం,రుతుక్రమ పరిశుభ్రత, బాల్య వివాహాలు, పోక్సో చట్టం, ఆత్మరక్షణ, వృత్తి విద్య, జీవనోపాధి అవకాశాలు మొదలైన వాటిపై విస్తృతంగా అవగాహన కల్పించేలా విస్తృత కార్యక్రమాలు చేపట్టాలని, వారి సంపూర్ణ పరిరక్షణ బాధ్యత ఐసిడిఎస్ సిబ్బంది దేనని సూచించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న డిప్యూటీ తాసిల్దార్ సుమని, ఎంఈఓలు కోదండ నాయుడు, ఈశ్వరయ్యలు మాట్లాడుతూ విద్యతోనే బాలికల వికాసం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం చంద్రకళ, హెల్త్ సూపరిండెంట్ ఇస్మాయిల్ భాష, ఐసిడిఎస్ సూపర్వైజర్లు వసుందరమ్మ, సురేఖరాణి, విజయ కుమారి మరియు అంగన్వాడీ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## శివోహం ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ

**ప్రొద్దుటూరు అర్బన్, డిసెంబర్ 23 ప్రభాతవార్త :**



శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించే అన్నప్రసాద సేవలో భాగంగా సోమవారం నక్కలదిన్నె గ్రామానికి చెందిన పాలగిరి యల్లారెడ్డి, భార్య సుబ్బమ్మ, కుమారుడు సతీష్ రెడ్డి, కోడలు కీర్తి, మనమడు సాత్విక్ రెడ్డి, పట్టణంలోని మోడంపల్లె గ్రామానికి చెందిన ఇరగంరెడ్డి సిద్దారెడ్డి, భార్య శకుతలమ్మ, కుటుంబ సభ్యుల సహకారంతో అన్నప్రసాద సేవ నిర్వహించారు. దాదాపు 800 మంది ఈ కార్యక్రమంలో పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా శివోహం అధ్యక్షులు శెట్టిపల్లె రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ దాదాపు గత 3 సంవత్సరాలుగా శివోహం అన్నప్రసాద సేవా సంఘం తరపున తాము ఈ అన్నప్రసాద సేవ నిర్వహిస్తున్నామని, ప్రజల స్పందన, సహకారం మరువలేనిదన్నారు. శివోహం వారి సేవలు నిరాటంకంగా కొనసాగిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో శివోహం కమిటీ ఉపాధ్యక్షులు డాక్టర్ మురుకూటి సూర్య నారాయణ రెడ్డి, సభ్యులు విష్ణు నారాయణ, విజయకుమార్, లింగారెడ్డి, కల్లూరు ప్రభాకర్ రెడ్డి, రమణయ్య, లక్కి రెడ్డి వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అరటిపంటనష్టం చెక్కులు పంపిణీ

**రైల్వే కోడూరు డిసెంబర్ 23 ప్రభాతవార్త:**



నియోజకవర్గంలోని ఓబులవారిపల్లి మండలం వైకోట ప్రాంతానికి చెందిన నక్కన సుబ్బరత్నమ్మకు చెందిన నాలుగు ఎకరాలలో అరటి పంట నష్టపోయిన విషయం తెలిసిందే. అదేవిధంగా అదే గ్రామానికి చెందిన కొండేటి చలపతి అనే వ్యక్తికి చెందిన అరటిపంటను కూడా గత ఆరు నెలల క్రితం అరటి పంటను ఏనుగులు ధ్వంసం చేసిన సందర్భంలో అటవీ శాఖ అధికారి పిఏ శ్యాంసుందర్లకు నివేదికలు పంపించి చెక్కులను మంజూరు చేశారు. ఇందులో నక్కన సుబ్బరత్నమ్మకు 42, వేల చెక్కును, కొండేటి చలపతికి 10 వేల చెక్కును అటవీశాఖ కార్యాలయంలో అందజేసినట్లు ఎఫ్ఆర్ఓ శ్యాంసుందర్ తెలిపారు.

## ముందస్తు క్రిస్మస్ వేడుకలు



**రైల్వేకోడూరు డిసెంబర్ 23 ప్రభాత వార్త.**

రైల్వేకోడూరు పట్టణంలోని డాల్ ఫిన్ డేల్ పాఠశాల అధినేతలు పంజం సుకుమార్ రెడ్డి, పంజం సృజని ఆధ్వర్యంలో సోమవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. దేవదూతలు, బాల యేసు, చిన్నారుల వేషధారణతో చక్కటి కళా రూపాన్ని రక్తి కట్టించారు. చిన్నారులు వేసిన ఈ నాటక ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా సుకుమార్ రెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాలలో ప్రతి పండుగను వైభవోపేతంగా చిన్నారుల చేత నాటకాల రూపంలో వేయించడం జరుగుతున్నదని ఆయన తెలిపారు తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన క్రిస్మస్ పండుగను చిన్నారుల చేత వేయించడం ఎంతో సంతోషంగా ఉన్నదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ మాస్టర్ బాల కుమార్ చెంగయ్య, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు చిన్నారులు పాల్గొన్నారు.

## విద్యుత్తు ఛార్జీల పెంపుతో అదనపు భారం

**వాల్మీకిపురం, డిసెంబర్ 23 ప్రభాతవార్త ః**

రాష్ట్రంలో గత ఎన్నికల్లో సూపర్ సిక్స్ హామీలంటూ అధికారంలో వచ్చిన సీఎం చంద్రబాబు నాయుడు ఇష్టానుసారంగా ట్రూఆఫ్ ఛార్జీల పేరిట విద్యుత్తు ఛార్జీలను పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నారని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆరోపించారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్తు ఛార్జీలు పెంచమంటూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఐదు నెలల్లోనే ఇప్పటికే రెండు పర్యాయాలు ట్రూఆఫ్ ఛార్జీల పేరిట విద్యుత్తు ఛార్జీలు పెంచి ప్రజలపై మోయలేని భారం మోపిందన్నారు గత ప్రభుత్వంతో పోలిస్తే కూటమి ప్రభుత్వ పాలనలో స్కూల్ ఫీజులు, పాల ధరలు, బియ్యం ధరలు, పప్పు దినుసులు, కూరగాయల ధరలు భారీగా పెరిగి ప్రజలపై మోయలేని భారం పడిందన్నారు. అలాగే ఉచిత ఇసుక అంటూనే ప్రకటనలు గుప్పించి ఉచిత ఇసుకను సైతం అధిక ధరలకు అమ్ముతూ ప్రజలను లూటీ చేస్తున్నారని వాపోయారు. మద్యం ధరలు పెంచారన్నారు. బాబు ష్యూరిటీలు గాలికి, వీరబాదుడు ప్రజలకని మాజీ ఎమ్మెల్యే విమర్శించారు .ఈ కార్యక్రమంలో వైకాపా సీనియర్ నాయకుడు చింతల ఆనందరెడ్డి, అబ్దుల్ కలీం, ఉపసర్పంచి కేశవరెడ్డి, నాయకులు నీళ్లభాస్కర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు..

## రోడ్డు సమస్యను పరిష్కరించండి సారూ



**వాల్మీకిపురం, డిసెంబర్ 23 ప్రభాతవార్త. ః**

మండలంలోని విఠలం పంచాయతీలోని కుందేళ్ళవారిపల్లెకు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న రోడ్డు సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ సోమవారం స్థానిక తహశీల్దార్ పామిలేటికి కుందేళ్లవారిపల్లె, పునుగుపల్లె గ్రామాలకు చెందిన వాల్మీకిసంఘం నాయకులు కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వాల్మీకిసంఘం నాయకులు మాట్లాడుతూ వాల్మీకిపురంలో వాల్మీకివిగ్రహం స్థాపనకు స్థలం కేటాయించాలని, అలాగే వాల్మీకిపురంలో బీసీఏలకు కేటాయించిన 9వ నెంబరు రేషన్ షాపును బీసీఏ వీర్గకరణకు చెందిన వాల్మీకికులస్థులకు కేటాయించాలని కోరారు ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వారు తహసీల్దార్ను కోరారు. ఈ కార్యక్రమంలో వాల్మీకిసంఘం అధ్యక్షుడు విష్ణుచైతన్య, సంఘం నాయకులు భరత్కుమార్, రమేష్, రామక్రిష్ణ, పని, సదా, దండువారిపల్లె రమణ, శంకర, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

## న్యాయం చేయండి

**కడప కార్పొరేషన్ డిసెంబర్ 23 ప్రభాతవార్త:**



సోమశిల ముంపు ప్రాంత బాధితులైన తమకు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ లక్షలాది రూపాయలు తీసుకొని మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని రాము, సుబ్బారాయుడు, రవిచంద్ర, కార్తీక్‌లు సోమవారం గ్రీవెన్స్‌లో కడప జిల్లా ఎస్పీ గారికి వినతి పత్రం సమర్పించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ సోమశిల ముంపు వాసులకు ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికి లక్షల రూపాయలు కొంతమంది మధ్య దళారీలు తీసుకున్నారని ఆరోపించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని 20 ఏళ్ల గా నమ్మ పలుకుతూ మోసం చేశారన్నారు. దుర్భరమైన స్థితిలో జీవిస్తున్నామని చెప్పారు. వారిపై చర్యలు తీసుకుని మా సొమ్ములు మాకు ఇప్పించాల్సిందిగా జిల్లా అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సోమశిల ముంపు బాధితులు పాల్గొన్నారు.

## మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలి

**పీలేరు, డిసెంబర్ 23 ప్రభాతవార్త ః**



సోమవారం ఉదయం ఆర్టీసీ బస్టాండ్ మాషా అల్లా ఆటో యూనియన్ అధ్యక్షులు చాను మరియు కార్యదర్శి మహబూబ్ భాష స్థానిక మీడియాతో మాట్లాడుతూ ఆర్టీసీ బస్టాండ్, మాషా అల్లా ఆటో స్టాండ్ ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను వివరించారు. పీలేరు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న మాషా అల్లా ఆటో స్టాండ్, ఆర్టీసీ బస్టాండ్ ప్రారంభమైనప్పటి నుండి పీలేరు పట్టణానికి ప్రయాణికులను చేరవేసే ఆటో డ్రైవర్లు తమ కుటుంబాలను పోషించుకుంటూ ఉపాధి పొందుతున్నారు. గత కొంత కాలంగా ఆటో డ్రైవర్లు తీవ్ర ఆర్థిక కష్టాలను ఎదుర్కొంటున్నారు. కారణం, ఆర్టీసీ బస్టాండ్ నుండి ప్రయాణికులు రోడ్డుకు వెళ్లే ప్రధాన మార్గంలో డ్రైనేజ్ కాలువ మరమ్మత్తులు అసంపూర్తిగా వదిలివేయడంతో ప్రయాణికులు ఇతర మార్గాల ద్వారా బయటికి వెళుతున్నారు. అందువల్ల ఆటో డ్రైవర్లకు బాడుగ దొరకడం లేదు. డ్రైవర్లకు రోజువారీ ఆదాయం తగ్గిపోయింది. బాడుగలు లేక, ఆటో డ్రైవర్లు తమ కుటుంబాలను పోషించడంలో ఇబ్బందులు పడుతున్నారు. కాబట్టి సంబంధిత అధికారులు స్పందించి డ్రైనేజ్ కాలువ మరమ్మత్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కోరారు. ఈ సమస్యకు అధికారులు త్వరగా స్పందిస్తే, పీలేరు పట్టణ ప్రజల ప్రయాణ సౌకర్యం మెరుగుపడటమే కాకుండా, ఆటో డ్రైవర్ల జీవనోపాధి కూడా మెరుగవుతుంది అన్నారు.

## సర్దుబాటు అయితేనే పరిష్కారం అవుతుంది



**వీరబల్లి, డిసెంబర్ 23, ప్రభాతవార్త :**

ఇరువర్గాల వారు సర్దుబాటు అయితేనే భూ సమస్య పరిష్కారం అయితదని జిల్లా సర్వే, భూమి రికార్డుల అధికారి భరత్ కుమార్ తెలిపారు. మండలంలోని సోమవారం గ్రామ పంచాయతీలో కమ్మపల్లిలో నివాసముంటున్న కొల్లి నాగయ్య, కోపూరు సుబ్బయ్యల మధ్య భూ సమస్యపై వివాదం జరుగుతూనే ఉంది. అప్పటి నుండి ఇప్పటివరకు రెవెన్యూ అధికారులు వారి మధ్య ఉన్న భూ సమస్యను పరిష్కరించలేకపోతున్నారు. అయితే నాగయ్య సీఎం ఫేస్‌కు ఫిర్యాదు చేయగా, ఫిర్యాదు మేరకు తనిఖీదారు పి ప్రసాద్ కలిసి సోమవారం భూ సమస్యను పరిశీలించడం జరిగింది. సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ భూమికి సంబంధించి హద్దులు తప్ప కొలతలు లేకపోవడం మరియు సబ్‌డివిజన్ కాకపోవడం వలన ఈ సమస్యను మేము పరిష్కరించలేమని, మీరు ఇరువర్గాల వారు సర్దుబాటు అయితే పరిష్కరించుటకు వీలవుతుందని లేకుంటే కోర్టుకు వెళ్లి తమ భూ సమస్యను తీర్చుకోవాలని ఫిర్యాదుదారులకు వివరించడం జరిగింది. భూ సమస్యల పైన రికార్డుల పైన ఫిర్యాదుదారులతోపాటు గ్రామస్తులు కూడా సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ సిబ్బంది, పోలీస్‌సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ రైతు దినోత్సవం

**వీరబల్లి, డిసెంబర్ 23, ప్రభాతవార్త:**



దేశాన్ని రక్షించే జవానులకు ఎంత ప్రాముఖ్యత ఉందో పట్టెడన్నం పెట్టే రైతన్నకు కూడ అంతే ప్రాముఖ్యత ఉంటుందని విఆర్డిఎస్ సురేంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా విఆర్డిఎస్ సంస్థ ఆధ్వర్యంలో చలపతి అనే రైతును సన్మానించారు.ఈ సందర్భంగా సురేంద్రారెడ్డి మాట్లాడుతు దేశానికి వెన్నుముకగా రైతులను అభివర్ణిస్తారు కానీ అన్న దాతల జీవితాలు భోరోసా లేని పరిస్థితి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సోమవరం మాజీ సర్పంచ్ శీను, డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

## కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలి

**కడప కలెక్టరేట్ డిసెంబర్ 23 ప్రభాత వార్త**



పీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్. షర్మిలా రెడ్డి పిలుపు మేరకు సోమవారం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎన్.డి. విజయ జ్యోతి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి కడప కలెక్టరేట్ కార్యాలయం వరకు అంబేద్కర్ సమ్మాన్ మార్చ్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ప్రారంభానికి ముందు దివంగత భారత ప్రధాన మంత్రి పి.వి.నరసింహారావు వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకున్న తరువాత అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించి భారత రాష్ట్రపతికి సంయుక్త కలెక్టర్ ద్వారా ఒక మెమోరాండం అందజేశారు. కలెక్టరేట్ ప్రాంగణంలో విలేకరులతో విజయ జ్యోతి మాట్లాడుతు కేంద్ర హోంమంత్రి అమిత్ షా వద్ద నైతికత ఉంటే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కడప అసెంబ్లీ కోఆర్డినేటర్ బండి జక్కరయ్య, కడప సిటీ అధ్యక్షుడు అఫ్జల్ ఖాన్, ఇర్ఫాన్, ధ్రువ కుమార్ రెడ్డి, పి.ఎం.డి.అలీ ఖాన్, సుశీల్ కుమార్, విజయ్ కుమార్, గౌస్ పీర్, గోసంగి సుబ్బా రెడ్డి, హరి ప్రసాద్, గున్నంపాటి వెంకట రమణ, సిరాజుద్దీన్, మొయినుద్దీన్, శ్యామలమ్మ, సంజయ్ కాంతా, సంతోషమ్మ, నాగరత్న గౌడ్, హమీద్, కమల్ పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## అన్ని సిమెంట్‌రోడ్డు నిర్మాణాలు, డ్రైనేజీ పూర్తి చేస్తాం

**చిన్నమండెం, డిసెంబర్ 23 ప్రభాత వార్త:**



వచ్చే రెండు సంవత్సరాల్లో చిన్నమండెం టౌన్‌లో సిమెంట్ రోడ్లు మరియు డ్రైనేజీ వ్యవస్థ పూర్తి చేస్తాం అని టీడీపీ యువ నాయకులు లక్ష్మి ప్రసాద్‌రెడ్డి అన్నారు, ఈ రోజు ఉదయం చిన్నమండెం టౌన్‌లో వారు అధికారులతో కలిసి పర్యటించి రోడ్ల గురించి చర్చించారు మొదటి విడతలో దాదాపుగా 70 లక్షల రూపాయలు వ్యయంతో సిమెంటు రోడ్ నిర్మాణం చేపట్టాలని అధికార్లకు ఆదేశించారు ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే మండలంలో దాదాపుగా అన్ని గ్రామాలలో నూతన బోర్లను వేయడం జరిగిందన్నారు. దాదాపుగా త్రాగునీటి సమస్య తీర్చడం జరిగిందన్నారు వచ్చే రెండు సంవత్సరాల్లో చిన్నమండెం మండలాన్ని అభివృద్ధి చేస్తాన్నారు

## ఆర్‌అండ్‌బీ అధికారులు మొద్దు నిద్ర వీడాలి

**గాలివీడు, డిసెంబర్ 23(ప్రభాతవార్త):**



కోట్ల రూపాయల విలువ చేసే ఆర్‌అండ్‌బీ స్థలంలో అక్రమ నిర్మాణాలు వెలుస్తుంటే తొలగించకుండా కాలయాపన చేస్తున్న ఆర్ అండ్ బీ అధికారులు మొద్దు నిద్ర వీడాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సిద్దిగాళ్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం గాలివీడులో పర్యటించిన ఆయన సీపీఐ నాయకులతో కలిసి గేటు నాలుగు రోడ్ల కూడలిలో ఆక్రమణకు గురైన ఆర్‌అండ్‌బీ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలివీడు పట్టణంలోని గేటు నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న దాదాపు 1.55 ఎకరాల భూమి ఆక్రమణ చెరలో చిక్కుకోగా, అందులో కొంత రెవెన్యూ అధికారుల చొరవతో అక్రమ నిర్మాణాలు తొలగించినప్పటికీ అందులో కనీసం కంచెగానీ బౌండరీగానీ ఏర్పాటు చేయకపోవడం ఆక్రమణదారులను మళ్లీ ప్రోత్సహించే విధంగా ఉందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు భాస్కర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## బోరెడ్డిగారిపల్లెలో వ్యక్తి దారుణహత్య

**గాలివీడు, డిసెంబర్ 23(ప్రభాతవార్త):**



మండలంలోని బోరెడ్డిగారిపల్లె సమీపంలో మల్లెల వెంకటరమణ ఉరఫ్ సత్తన్న(28) అతి కిరాతకంగా హతమార్చారు. ఆవేశంలో ఈ హత్య తానే చేశానంటూ నిందితుడు రమణారెడ్డి పోలీస్‌స్టేషన్లో లొంగిపోయినట్లు పోలీసులు వెల్లడించారు. వివరాలలోకి వెళ్తే పోలీసుల కథనం మేరకు.. ఆదివారం బోరెడ్డిగారిపల్లెలో పెద్దఖర్మ సందర్భంగా కథ చెప్పడానికి వెళ్లిన నక్కలవాండ్లపల్లె బృందంలో అదే గ్రామానికి చెందిన రమణారెడ్డి ఒక పాత్ర పోషించగా నూలివీడు గ్రామం కొత్తబండివాండ్లపల్లెకు చెందిన మృతుడు వెంకటరమణ ఉరఫ్ సత్తన్న బఫూన్‌గా మరో పాత్ర పోషించారు. నాటకంలో వారిరువురు మధ్య పాత్రలపరంగా చిన్న వాగ్వాదం చోటు చేసుకోగా స్థానికులు సర్దిచెప్పారు. అయితే నాటకం ముగిసిన అనంతరం బస్సు కోసం అని ప్రధాన రహదారిపై బస్‌షెల్టర్ వద్దకు రాగానే వారిరువురు మధ్య వాగ్వాదం హెచ్చుమీరి ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. దీంతో కోపోద్రిక్తుడైన రమణారెడ్డి అతికిరాతకంగా వెంకటరమణను ఉరఫ్ సత్తన్నను బండరాళ్లతో కొట్టి హతమార్చి దిక్కుతోచని స్థితిలో నిందితుడు రమణారెడ్డి పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని తానే హత్య చేసినట్లుగా ఒప్పుకుని పోలీసులకు లొంగిపోయాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని లక్కిరెడ్డిపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించగా, మృతుడు సోదరుడు ఆంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

## షార్ట్ సర్క్యూట్‌తో పాలవ్యాన్ దగ్ధం

**మదనపల్లెక్రైం, డిసెంబర్ 23 ప్రభాతవార్త :**



షార్ట్ సర్క్యూట్‌తో పాల వ్యాన్ దగ్ధమైన సంఘటన ఆదివారం రాత్రి మదనపల్లెలో చోటుచేసుకుంది. అగ్నిమాపక అధికారి శివప్ప కథనం మేరకు వివరాలిలా వున్నాయి. మదనపల్లె రూరల్ మండలం అంకిశెట్టిపల్లికి చెందిన శ్రీనివాసులు టెంపోలో గ్రామాల నుంచి డైరీకి పాలు చేరవేసి జీవనం సాగిస్తున్నాడు. రోజులాగా శనివారం టెంపోలో గ్రామం నుంచి పాలు తీసుకుని చిప్పిలి సమ్మర్‌స్టోరేజ్ వద్దకు రాగానే షార్ట్‌సర్క్యూట్‌తో వాహనం దగ్ధమైంది. వాహనంకు నిప్పుఅంటుకోవటం గమనించిన యజమాని శ్రీనివాసులు అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇవ్వటంతో, వెంటనే అక్కడికి చేరుకుని అగ్నిమాపక అధికారులు మంటలను అదుపు చేశారు. అప్పటికే 75శాతంకు పైగా కాలిపోవటం జరిగిందని అగ్నిమాపక అధికారి శివప్ప తెలిపారు. ఈ ప్రమాదంలో రూ.4.5లక్షల నష్టం వాటిల్లిందని తెలిపారు.

## రైతులు ఐక్యంగా ఉంటే సమస్యలు పరిష్కారం



**మైదుకూరు,డిసెంబర్ 23, ప్రభాతవార్త:**

మండలం వనిపెంటలో గ్రామీణ రైతులతో రైతు సేవా సమితి మండల ఆధ్వర్యంలో జరిగిన జాతీయ రైతు దినోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షుడు ఏ.వి. రమణ గ్రామ రైతులతో కేక్ కట్ చేసి రైతులతో జాతీయరైతు దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి రమణ మాట్లాడుతూ ప్రస్తుతం రైతాంగ సమస్యలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించడం లేదని కడప జిల్లాలో గత 15సం,20 సంవత్సరాల క్రితం శంకుస్థాపన చేసిన సాగు, తాగునీటి ప్రాజెక్టులు ఇప్పటివరకు పూర్తి కాలేదని,పకృతి వైపరీత్యాలైన కరువు, వర్షము వల్ల పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వాలు ఆదుకోవడం లేదని ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం వస్తే రైతుకు 20వేల రూపాయలు రైతు భరోసా ఇస్తామన్న చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు దాటిపోయిన ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం నుండి సంక్షేమ రూపంలో రైతుకు ఒక్క రూపాయి కూడా రాలేదని పై సమస్యల పరిష్కారం కావాలంటే గ్రామీణ ప్రాంత రైతాంగం రాజకీయాలకు అతీతంగా ఐక్యంగా ఉద్యమిస్తే తప్ప సమస్యలు పరిష్కారం కావని ఇప్పటికైనా రైతాంగం తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాలను ప్రశ్నించి సాధించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సేవాసమితి నియోజకవర్గ కార్యదర్శి సహదేవుడు, నాయకులు మురళి, రమేష్, రామాంజనేయరెడ్డి, షరీఫ్, పోలయ్య, గ్రామీణ రైతులు పాల్గొన్నారు.

## ఉపాధి పనులతో కాలువలకు మహర్దశ

**సుండుపల్లె, డిసెంబర్ 23,ప్రభాతవార్త:**



ఉపాధి హామీ పనులతో రైతులకు సాగునీటిని అందించే కాలువ పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు టెక్నికల్ అసిస్టెంట్ రవీంద్ర, ఫీల్డ్ అసిస్టెంట్ అమరావతిలు తెలిపారు. మండలంలోని మాచిరెడ్డిగారిపల్లి గ్రామ పంచాయతీ మిట్టబిడికి సమీపంలో అలాగే పెద్ద బిడికి, రెడ్డి చెరువు భాగంలోని పిల్ల కాలువల్లో జరుగుతున్న ఉపాధి పనులను తనిఖీ చేశారు. ఉపాధి హామీ పనుల్లో భాగంగా వ్యవసాయానికి వీలుగా ఉండేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పనులు కల్పించాలని ఆదేశించడంతో రైతులకు ఉపయోగపడే పనులు చేయిస్తున్నట్లు తెలియజేశారు. సుమారు 100 మంది ఉపాధి కూలీలు పనులకు హాజరైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా రికార్డులు తనిఖీ చేసినట్లు టెక్నికల్ అసిస్టెంట్ తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది కూలీలు పాల్గొన్నారు.

## మార్చ్ ర్యాలీలో పాల్గొన్న ఇర్ఫాన్ భాష



**ప్రొద్దుటూరు డిసెంబర్ 23 ప్రభాతవార్త**

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైయస్ షర్మిలారెడ్డి పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎండి విజయ జ్యోతి నేతృత్వంలో సోమవారం కడపలో నిర్వహించిన బాబాసాహెబ్ అంబేద్కర్ సన్మాన మార్చి ర్యాలీలో ప్రొద్దుటూరు కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ ఎస్ ఇర్ఫాన్ భాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కడప కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ ప్రాంగణానికి చేరుకున్న అనంతరం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించి జిల్లా సంయుక్త కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాబాసాహెబ్ అంబేద్కర్ ను అగౌరవపరిచిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

## చెక్కులు పంపిణీ

**పుల్లంపేట డిసెంబర్ 23 ప్రభాతవార్త**



కోడూరు శాసనసభ్యుడు శ్రీధర్ లబ్ధిదారులలకు కావలసిన పనులను ప్రభుత్వం దగ్గర మంజూరు చేయించి లబ్ధిదారుడికి అందజేయడానికి నేరుగా ఇంటికి వచ్చే అందజేయడం హర్షనీయం. వివరాల్లోకి వెళితే సీత రాజంపేట గ్రామానికి చెందిన భీమిశెట్టి బలరామయ్య అనారోగ్య పాలవడంతో సహాయనిధి నుంచి సహాయం కోరుతూ ఎమ్మెల్యే ద్వారా అర్జీ పెట్టుకున్నాడు. మంజూరైన రూ.4,16,250 నేరుగా లబ్ధిదారుడి ఇంటికే ప్రభుత్వ విప్, ఎం.ఎల్.ఎ చేరుకొని చెక్కును అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా శాసనసభ్యులు శ్రీధర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పద్మశాలి సంఘం నాయకుడు దొంతు శివయ్య, కాటా బత్తిన నరసరామయ్య, డీలర్ రమణ ,ఫైనాన్స్ ఆదినారాయణరెడ్డి, సాదువారిపల్లి శంకర్ రెడ్డి, టి కమ్మపల్లికి చెందిన దేశం నాయకుడు కాపేర్ల చంద్రశేఖర్ నాయుడు, లబ్ధిదారు నీ కుటుంబ సభ్యులు, సీతారాజంపేట గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో డాక్టరేట్ ప్రధానం

**ఎడ్యుకేషన్: డిసెంబర్ 23 ప్రభాతవార్త**



కడప నగరంలోని గవర్నమెంట్ కాలేజ్ ఫర్ మెన్ లో డిపార్ట్మెంట్ ఆఫ్ జువాలజీలో పరిశోధనలు చేసిన ఇనుకోలు అపర్ణకు శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ వారు డాక్టరేట్ పట్టాను ప్రధానం చేశారు, నేడు యావత్ ప్రపంచంలో అత్యధిక శాతం లో వినియోగిస్తున్న ప్లాస్టిక్ దాని వల్ల కలిగె నష్టాలు నివారించడానికి ప్లాస్టిక్ వినియోగం తగ్గించడానికి ఎంతో ఉపయోగకరమైన బయో ప్లాస్టిక్ పైన పరిశోధనలు చేసినందుకు గాను ఈ డాక్టరేట్ను ప్రధానం చేసినట్లుగా పరీక్షల నియంత్రణ విభాగం అధికారి దామ్లా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. జువాలజీ విభాగంలోని విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ ఎం. శ్రీనివాసులు రెడ్డి పర్యవేక్షణలో "ఎఫికెసీ ఆఫ్ బయోఫ్లాక్స్ ఇన్ ద కల్చర్ ఆపరేషన్ ఆఫ్ పసిఫిక్ వైట్ ష్రిమ్ప్ లితోపీనియస్ వనామీ" అనే అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించారు.

# క్యాన్సర్ సోకి ప్రాణాపాయ స్థితిలో ఉన్నా ప్రాణాభిక్ష పెట్టండి

**మదనపల్లె క్రైమ్ డిసెంబర్ 23 ప్రభాతవార్త.**

క్యాన్సర్ సోకి ప్రాణాపాయ స్థితిలో ఉన్నా.. ప్రాణభిక్ష పెట్టండి. అంటూ ఓ బాధితురాలు దాతలను అర్థిస్తోంది. ఈ మేరకు సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బాధితురాలు మాట్లాడుతూ మదనపల్లె పట్టణం దిగువ కమ్మపల్లెకు చెందిన భార్గవి అనే నేను ఇళ్లలో పాచి పనులు చేసుకునేదాన్ని. నా భర్త రవీందర్ నాయక్ హోటల్ లో పనిచేసేవాడు. మాకు పది నెలల చిన్నారి విభావరి ఉంది. ఇళ్లల్లో, హోటల్ లో పనులు చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొచ్చే వాళ్ళం. ఈ క్రమంలో నవంబర్ నెలలో పనులు చేస్తూ కిందపడ్డాను. ఆ సమయంలో మోకాలి వద్ద గాయం కావడంతో చికిత్స చేయించుకున్నాను. క్రమేనా అది క్యాన్సర్‌గా మారడంతో దిక్కుతోచని స్థితిలో పడిపోయాము. పని చేస్తే కానీ ఆ పూట గడవని పరిస్థితి మాది. తెలిసిన వారి దగ్గర అప్పులు చేసి సుమారు రూ. లక్ష వరకు ఖర్చు చేసి వైద్యం చేయించుకున్నాము. జబ్బు నయం కాలేదు. తిరుపతిలోని స్విమ్స్, బర్డ్స్ హాస్పిటల్, బెంగళూరులోని వైదేహి హాస్పిటల్ లోని పెద్ద వైద్యులు పరీక్షించి ఇది చాలా తీవ్రమైన జబ్బు అని తప్పకుండా సర్జరీ చేయాలని రూ. 10 లక్షలు వరకు ఖర్చవుతుంది. మాకు అంత స్థోమత లేదు. ఈ జబ్బుకు ఆరోగ్యశ్రీ వర్తించకపోవడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డాము. రూ.10 లక్షలు లేనిదే సర్జరీ చేయమని వైద్యులు అంటున్నారు. నాకు పది నెలల పాప ఉంది. దాతలు స్పందించి వైద్య చికిత్సల కోసం ఆర్థిక సాయం చేసి ప్రాణభిక్ష పెట్టండి అంటూ బాధితురాలు వేడుకుంటోంది. దాతలు 9133904329 నెంబర్ కు సంప్రదించాలని కోరుతోంది.



# పంట సాగు నుంచి అమ్మే వరకు రైతులకు అండగా నిలబడాలి

**రాజంపేట అర్బన్, డిసెంబర్ 23 ప్రభాతవార్త**

రాజంపేటలోని బిజెపి కార్యాలయంలో జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా సోమవారం రైతులను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమం బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈ పాపయ్య అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నంద్యాల జిల్లా ఇంచార్జ్ పోతు గుంట రమేష్ నాయుడు మాట్లాడుతూ రైతు సంతోషంగా ఉన్నప్పుడే రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు. దుక్కి దున్నిన నాటి నుండి పంటను అమ్మి డబ్బు చేతికొచ్చే వరకు రైతుకు ప్రభుత్వం అండగా నిలవాలన్నారు. దేశానికి రైతు వెన్నుముక అని, రైతు లేనిదే రోజు మనిషి లేడ బారు. నిరంతర శ్రమజీవులైన అన్నదాతలందరికి జాతీయ రైతు దినోత్సవం శుభాభినందనలు తెలియజేశారు. వ్యవసాయంలోనే సాయం ఉన్నది అగ్రికల్చర్ లోనే కల్చర్ ఉన్నదని, దేశానికి అన్నం పెట్టే రైతును ప్రభుత్వం ఎప్పుడు ఆదుకోవాలని వారన్నారు. అనంతరం రాజంపేటకు సంబంధించిన రైతులు జనార్దన్ రాజు, పెండిబోయిన చిన్నయ్య హోలీ వెంకటసుబ్బయ్య రైతులను శాలువాతో ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి పట్టుపోగుల ఆదినారాయణ, బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి వివి రమణ, బిజెపి కిషన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి .పాపయ్య, బిజెపి పార్లమెంట్ నాయకులు తోట నగేష్, బీజేవైఎం మండల అధ్యక్షులు పత్తిపాటి నవీన్ కుమార్, పట్టణ కార్యదర్శి సుబ్రహ్మణ్యం నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



### అన్నమాచార్య యూనివర్సిటీలో రైతు దినోత్సవం

అన్నమాచార్య యూనివర్సిటీలో ఘనంగా రైతు దినోత్సవ వేడుకలు అన్నమాచార్య విశ్వవిద్యాలయ వ్యవసాయ కళాశాలలో సోమవారం జాతీయ రైతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారత మాజీ ప్రధానమంత్రి చౌధరి చరణ్ సింగ్ జయంతిని పురస్కరించుకుని రైతుల కృషికి గౌరవం తెలుపుతున్న వేళ, ఈ విశ్వవిద్యాలయం రైతులకు ఆధునిక పద్ధతులపై అవగాహన కల్పించడంలో ముందంజలో నిలిచిందని, రైతుల కృషి దేశ అభివృద్ధికి పునాదిగా ఉంది అని వ్యవసాయ కళాశాల వ్యవస్థాపకులు చొప్పా గంగి రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల వ్యవసాయ అధికారిని ఆర్. రాజకుమారి, గ్రామ సెరికల్చర్ అధికారిని జి. సిద్దేశ్వరి, గ్రామ వ్యవసాయ సహాయకులు జయ్ పాల్ హాజరయ్యారు. వారు ప్రసంగిస్తూ రైతుల పరోపకారమే దేశ ఆర్థిక వ్యవస్థకు పునాదిగా ఉందన్నారు. వారి కృషితో అందరికీ ఆహార భద్రత సాధ్యమవుతుందన్నారు.అయితే, నేటి తరానికి సరైన సాగు విధానాలు, సమర్థవంతమైన వనరుల వినియోగం, పర్యావరణ పరిరక్షణ, మరియు న్యూట్రిషియస్ ఫుడ్ ఉత్పత్తిపై అవగాహన కల్పించడం అత్యంత అవసరం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాల సిబ్బంది, విద్యార్థులు మదన గోపాల పురం గ్రామంలో ఒక భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ద్వారా రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. రసాయన ఎరువులను తగ్గించుకుని, సేంద్రీయ వ్యవసాయ పద్ధతులు, నీటి సంరక్షణ, పంట మార్పిడి, భూసార పరీక్ష, బిందు సేద్యం, స్థిరమైన వ్యవసాయం వ్యవసాయ విస్తరణ కేంద్రాల సందర్శన వంటి అంశాలను వివరించారు. విద్యార్థులు గ్రామ రైతులకు వారధిగా మారారు. వారు రైతులతో మాట్లాడి తమ కళాశాల ద్వారా అందించే అవకాశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జె. కర్పగం, డాక్టర్ ఈ. ఉషారాణి, డాక్టర్ బి.సుకృత, డి.దివ్య, కె.శృతి పాల్గొన్నారు.

# వ్యవసాయంలో ఆధునీకతను అనుసరించాలి

**పీలేరు డిసెంబర్ 23 ప్రభాతవార్త ః**

వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను అనుసరిస్తూ కొత్త వరవడిని తీసుకురావాలని కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ కె. మంజుల, పీలేరు వ్యవసాయ సహాయ సంచాలకులు వైవి రమణ రావు తెలిపారు. మహానంది వ్యవసాయ కళాశాల విద్యార్థులు తమ అధ్యయనంలో భాగంగా మూడు నెలల కాలం పాటు క్షేత్రస్థాయిలో వ్యవసాయం, అనుబంధ రంగాలపై అవగాహన పొంది కలికిరి కెవికె ఆధ్వర్యంలో పీలేరు మండలం, బాలంవారిపల్లిలో రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ కె. మంజుల అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ ఆధునిక పద్ధతులైన డ్రోన్ వినియోగం, జీవ శిలీంద్ర నాశిని వంటి వాటిని వినియోగంలోకి తీసుకువెళ్లాలన్నారు. మహానంది వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వై. పవన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, రైతు దినోత్సవం రోజున రైతు సదస్సు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు. తమ విద్యార్థులను మూడు నెలల కాలం పాటు ఆదరించిన రైతులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. కెవికె సమన్వయకర్తకు, శాస్త్రవేత్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. వ్యవసాయ విభాగం శాస్త్రవేత్త సోమశేఖర్ బాబు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో ముఖ్యంగా పండిస్తున్న వేరుశనగ, వరి, అపరాల్లోని మేలైన వంగడాలను, మట్టి నమూనా పరీక్షల ఆవశ్యకతను తెలిపారు. సస్యరక్షణ విభాగం శాస్త్రవేత్త పీరు సాహెబ్ మాట్లాడుతూ వేరుశనగ. టమోటా, మామిడి మొదలగు పంటల్లో ప్రధాన సమస్యలైన వేరుకుళ్ళు, ఆకు ఎండు తెగుళ్ళు, తేనె మంచు పురుగు, అడవి పందులు మొదలగు సమస్యల గురించి పాటించే నివారణ మార్గాలను తెలియజేశారు. జిల్లాలో తోట పంటలకు ఆదరణ పెరుగుతుందని, మామిడిలో కొమ్ము కత్తరింపులు ముఖ్యంగా చేపట్టాలని వివరించారు. సూక్ష్మపోషకాల లోపాలను, కూరగాయలు, తోట పంటలలో తప్పక సవరించాలని ఉద్యాన విభాగం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు వివరించారు. పశువైద్య శాస్త్రవేత్త డాక్టర్ నవీన మాట్లాడుతూ నాటు కోళ్ళకు ధీటుగా అధిక గ్రుడ్లు పెట్టే రకాలైన రాజశ్రీ గ్రామ ప్రియ రకాలను పెంచుకోవచ్చని, ముఖ్యంగా కోళ్ళు, పశువులకు సంక్రమించే వ్యాధులు, వాటి నిర్మూలనకు అందుబాటులోని టీకాల గురించి వివరించారు. విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ మాధురి మాట్లాడుతూ ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా రైతులకు అందుబాటులోని సమాచార వ్యవస్థల గురించి తెలియజేశారు. అభ్యుదయ రైతులైన సురేంద్రనాథ్ రెడ్డి, నాగరాజ, చంద్రయ్య తదితర రైతులు మాట్లాడుతూ కెవికె ఇచ్చే సలహాలను సద్వినియోగం చేసుకుంటున్నారని శాస్త్రవేత్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు. విద్యార్థులకు క్షేత్రస్థాయిలో తగిన సూచనలతో పాటు తోడ్పాటును అందించినట్టు తెలిపారు. విద్యార్థినీ, విద్యార్థులు మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమం తమకు ఎంతో ఉపయోగకరమని మార్గదర్శకులుగా వ్యవహరించిన శాస్త్రవేత్తలకు, రైతులకు కృతజ్ఞతలు చెప్పుకున్నారు. చివరగా నూతన వంగడాలను పండించడానికి ఆసక్తి గల రైతుల జాబితాను తీసుకుంటూ, చిక్కుడు, అనప, సొర, బీర, బీన్స్, బెండ మొదలగు విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు.



## కరెంటు తీగలను వెంటనే తొలగించాలి



**చిన్నమండెం, డిసెంబర్ 23 ప్రభాత వార్త:**

మండలంలోని ఉర్దూ ఉన్నత పాఠశాల పైన ఉన్న కరెంటు తీగలను వెంటనే తొలగించాలని రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి విద్యుత్ అధికారులకు సూచించారు. సోమవారం రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చిన్నమండెం మండలంలోని పలు గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు ఉర్దూ పాఠశాలలోని విద్యార్థులతో వారి యొక్క సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అక్కడి ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఉర్దూ పాఠశాల పైన కరెంటు తీగలు వెళ్తున్నాయని ఈ కరెంటు తీగల వల్ల విద్యార్థులకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని మంత్రికి తెలిపారు. దీంతో మంత్రి వెంటనే విద్యుత్ అధికారులకు ఫోన్ చేసి కరెంటు తీగలను తొలగించాలని వారికి సూచించారు.

## శ్రీ సాయి వికాస్‌లో రైతు దినోత్సవ వేడుకలు



**చిట్వేలి, డిసెంబర్ 23, ప్రభాతవార్త:**

స్థానిక శ్రీ సాయి వికాస్ పాఠశాలలో జాతీయ రైతు దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. 9,10 వ తరగతి పిల్లలను సమీప బాకరాపురంలోని వ్యవసాయ పొలాలలో రైతులతో కలిసి వ్యవసాయంపై అవగాహన కల్పించి,వ్యవసాయ ప్రాధాన్యతను తెలియపరిచారు. కరస్పాండెంట్ తిరుమల రెడ్డయ్య మాట్లాడుతూ రైతు లేనిదే రాజ్యం లేదని, నూతన వ్యవసాయ విప్లవానికి విద్యార్థుల ఆలోచన తోడ్పాటు కావాలన్నారు. భారత ఐదవ ప్రధాని చౌదరి చరణ్ సింగ్ పుట్టినరోజున నిర్వహించే ఈ రైతు దినోత్సవం రోజున రైతుల కష్టాన్ని వారి గొప్పతనాన్ని స్మరించుకోవడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

## రైతు దేశానికి వెన్నెముక

**బద్వేలు, డిసెంబర్ 23 (ప్రభాతవార్త) :**

పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో బుధవారం వ్యవసాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పలువురు రైతులను సన్మానించి తమ కృతజ్ఞతను చాటుకున్నారు. కార్యక్రమంలో బాగంగా పాఠశాల ప్రిన్సిపాల్ జయశ్రీ మాట్లాడుతూ నేడు మనం కడుపునిండా అన్నం తింటున్నామంటే అది రైతుల చలువేనని, రైతులు రాత్రి,పగలు శ్రమించి పంటలు పండిస్తారని అది చేతికి అందుతుందనే నమ్మకం లేకపోయినా కుంగిపోక మరళా వ్యవసాయాన్ని కొనసాగిస్తారన్నారు. రైతు దేశానికి వెన్నెముక అని, అన్నం పెట్టే రైతుకష్టపడకుంటే మనం చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుం దని, వ్యవ సాయం లోనే సాయం ఉందని రైతులు ప్రజలకు చేసే సాయం ఎంతో ఉందని, అయితే వారు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలేక దళారుల చేతులలో మోసపోతున్నారని, మనం ఏదైనా వస్తువును తయారు చేసి విక్రయిస్తే దానికి మనం రేటును నిర్ణయించినట్లుగానే, రైతులు కూడా వారు పండించే పంటకు వారే రేటును నిర్ణయించేలా ప్రభుత్వం సహకరించాలన్నారు. ప్రజలకోసం నిరంతరం శ్రమించే రైతులను ప్రతిఒక్కరూ గౌరవించాలన్నారు. అనంతరం విద్యార్థులచే పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.




## ప్రతి కార్యకర్తను కాపాడుతా : ఎంపీ



**పులివెందుల, డిసెంబర్ 23, ప్రభాతవార్త :**

వైకాపాలోని ప్రతి కార్యకర్తను కాపాడుకుంటామని, ఎవరూ అధైర్య పడకండి అందరికీ అండగా ఉంటానని కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. సోమవారం తన నివాసం వద్ద ప్రజా దర్బార్ నిర్వహించారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. ప్రతి సమస్యను కూలంకుశంగా వింటూ సమస్యలు పరిష్కారమయ్యే వరకు అండగా ఉంటానని, ఎవరు అధైర్య పడకుండా ఉండాలని వారికి భరోసా ఇచ్చారు. సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి త్వరగా సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతరం లింగాల మండలం తాతి రెడ్డిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నేడు పులివెందులకు మాజీ సీఎం జగన్ రాక

**పులివెందుల, డిసెంబర్ 23, ప్రభాతావార్త :**

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మంగళవారం నుంచి నాలుగు రోజులపాటు జిల్లాలో పర్యటించ నున్నారు.24 వ తేదీ న ఇడుపులపాయ ఎస్టేట్ చేరుకుని వైయస్ సభ్యుల తోనూ, వైసిపి నాయకులతో చర్చించనున్నారు. 25 తేదీన పులివెందుల సిఎస్ఐ చర్చ్ లో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. అనంతరం వివాహ వేడుకల్లో పాల్గొని తర్వాత లింగాల మండలం తాతి రెడ్డిపల్లి సీతారామ దేవస్థానం ప్రతిష్ఠా కార్యక్రమంలో పాల్గొంటారు. 26 తేదీన పులివెందుల క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తారు.27 తేదిన ఉదయం విజయవాడ కు బయలుదేరుతారు.

## జర్నలిస్టులకు క్రీడలు అవసరం



**పులివెందుల, డిసెంబర్ 23, ప్రభాతవార్త :**

నిత్యం సంఘర్షణతో కూడిన వృత్తిలో ఉన్న జర్నలిస్టులకు మానసిక ప్రశాంతత కోసం క్రీడలు అన్ని విధాలుగా ఉపయోగపడతాయని కడప పార్లమెంట్ సభ్యులు వైయస్ అవినాష్‌రెడ్డి అన్నారు. పులివెందుల ఆర్.అండ్.బి అతిథి గృహంలో జరిగిన జేశాప్ కడప జిల్లా మహాసభకు ముఖ్య అథిదిగా హాజరయ్యారు. భూమిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి అధ్యక్షత జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో జరిగే జర్నలిస్ట్ క్రీడా కార్యక్రమాలకు తాను, వైసిపి పార్టీ నాయకత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించడానికి ముందుంటామని తెలిపారు. యూనియన్ లకు అతీతంగా జేశాప్ క్రీడా జర్నలిస్టులకు వేదికగా ఉండటం అభినందనీయం అని ఆయన అన్నారు. జర్నలిస్టులకు రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లు నిర్వహించిన సందర్భంలో వైయస్ అవినాష్ రెడ్డి గారి పాత్ర మరమలేమని జేశాప్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రమణారెడ్డి పెర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పులివెందుల మున్సిపల్ చైర్మెన్ వరప్రసాద్, మాజీ మార్కెట్ కమిటి చైర్మెన్ చిన్నప్ప, హాల్ గంగాధర్ రెడ్డి, కౌన్సిలర్ కిశోర్ తో పాటు జేశాప్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటరెడ్డి జర్నలిస్టులు పాల్గొన్నారు.

## ఎస్సారైటీ విద్యార్థులు క్రీడా ప్రతిభ



**ప్రొద్దుటూరు అర్బన్, డిసెంబర్ 23, ప్రభాతవార్త :**

ఈ నెల 19, 20, 21 వ తేదీలలో కడప గవర్నమెంట్ మహిళా పాలిటెక్నిక్ కళాశాల మరియు రాయలసీమ వ్యాయమ కళాశాల ప్రొద్దుటూరు లలో నిర్వహించిన పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ నందు సాయి రాజేశ్వరి ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాల డిప్లొమా విద్యార్థులు ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాండురంగన్ రవి తెలిపారు. ఈ క్రీడా పోటీలలో పాల్గొన్న కళాశాల విద్యార్థులు బాలుర విభాగములో 200 మీటర్స్ రన్నింగ్ లో జె.విష్ణువర్ధన్ గోల్డ్ మెడల్, 100 మీటర్స్ రన్నింగ్ లో జె.విష్ణువర్ధన్, డి.నిరంజన్ కుమార్, ఎం. ఉమర్ హుస్సేన్, పి.వెంకట కిరణ్, 400 మీటర్స్ రన్నింగ్ విష్ణు వర్ధన్, నిరంజన్ కుమార్, వీర బ్రహ్మం, పి.వెంకట కిరణ్ కాంస్య పతకాలు, టేబుల్ టెన్నిస్ (డబుల్స్) రామ నరసింహులు, వెంకట రాముడు రన్నర్ అప్ గా మరియు బాలికల విభాగములో ఎన్. శశికళ ట్రిపుల్ జంప్ లో గోల్డ్ మెడల్, 400 మీటర్స్ రన్నింగ్ లో సిల్వర్ మెడల్, షాట్ పుట్ లో టి.గంగా ధరణి సిల్వర్ మెడల్ సాధించారని వివరించారు. ఈ సందర్భంగా క్రీడలలో ప్రతిభ కనిపరిచిన విద్యార్థిని విద్యార్థులను సోమవారం కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్ రెడ్డి, కరస్పాడెంట్ వీరకల్యాణ్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ వెంకటేశ్వర రెడ్డి, హెచ్.ఓ.డి లు అభినందించారు.

# వీరారెడ్డి 24వ వర్ధంతిని జయప్రదం చేయండి

**బద్వేలు, డిసెంబరు 23 ప్రభాతవార్త :**



విద్యా ప్రదాతగా పేరుగాంచిన, దివంగత మాజీ మంత్రి వర్యులు బిజివేముల వీరారెడ్డి 24వ వర్ధంతిని జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, ఆమె కుమారుడు యువనేత రితేష్ కుమార్‌రెడ్డిలు కోరా రు. బద్వేలు పట్టణంలో ఎన్నో విద్యాసంస్థలు నెలకొల్పి తన పేరును చిరస్మరణీయం చేసుకున్న విద్యా ప్రదాత, నియోజకవర్గ రైతాగానికి వర ప్రసాదిని అయిన తెలుగుగంగ ప్రాజెక్టుకోసం అవిరళ కృషిచేసిన అ పర భగీరథుడు బిజివేముల వీరారెడ్డి సర్పంచ్ స్థాయి నుంచి కేబినెట్ మంత్రి వరకు వివిధహోదాల్లో పనిచేసిన ఆయన డిసెంబర్ 25న 2000ల సంవత్సరంలో మరణించారు. ఈ సందర్భంగా ఆయన 24వ వ వర్ధంతి బుధవారం జరుగుతున్న నేపథ్యంలో నియోజకవర్గంలోని తెలుగుదేశం నాయకులు ,అభి మానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని నివాళులర్పించాలని మాజీ ఎమ్మె ల్యే, యువనేత రితేష్‌కుమార్‌రెడ్డిలు పేర్కొన్నారు. ఇందులో భాగంగా పలువు రు వైద్య నిపుణులతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని, అ లాగే అన్నదాన, సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్ప టికే వర్ధంతి సంబరాలు జరుపుకునేందుకు కూటమి నేతలు సిద్ధమవుతున్నారు. వీరారెడ్డి అభిమానులు, విజయమ్మ, రితేష్ అభిమానులు ఫ్లెక్సీలతో బద్వేలు అంతా ముంచెత్తనున్నారు. తమ అభిమానాన్ని చాటుకునేందుకు నలు మూలల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొననున్నట్లు తెలు స్తోంది. ఇందుకు తగిన ఏర్పాట్లు చేసేందుకు రితేష్ రెడ్డి యువసేన ఇప్పటికే పనులలో నిమగ్నమయ్యారు.

## పులివెందుల అభివృద్ధికి సహకరించండి

**పులివెందుల, డిసెంబర్ 23, ప్రభాతవార్త :**



గత ప్రభుత్వంలో అభివృద్ధికి నోచుకోలేదని, మున్సిపాలిటీ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణను శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి కోరారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో మున్సిపల్ శాఖ మంత్రిని కలిసి పులివెందుల సమస్యలను వివరించారు. మునిసిపాలిటీలో అనేక ప్రాంతాలలో సరియైన డ్రైనేజీ, సిమెంటు రోడ్లు, త్రాగునీటి సరఫరా సరిగ్గా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనేక పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. పులివెందుల మున్సిపాలిటీలో వివిధ అభివృద్ధి పనులు చేయడానికి అత్యవసరంగా ఐదు కోట్ల రూపాయల నిధులను మంజూరు చేయవలెనని ఆయన మంత్రిని కోరారు.

## కంటి అద్దాల టెండర్ ప్రక్రియ పూర్తి

**రాయచోటి, డిసెంబర్ 23 ప్రభాతవార్త**



జాతీయ అంధత్వ, దృష్టి లోప నియంత్రణ కార్యక్రమంలో భాగంగా కంటి అద్దాల టెండర్ ప్రక్రియ పూర్తయినట్లుగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కొండయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బడికి వెళ్లే విద్యార్థులలో అంధత్వము, దృష్టిలోపం నివారణ కోసం జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా 3200 కళ్ళద్దాల కోసం ఈ నెల 14న టెండర్ నోటిఫికేషన్ ఇచ్చామని, టెండర్ దరఖాస్తులను సమర్పించడం కోసం ఈనెల 16 నుండి 22వ తేదీ వరకు గడువు ఇచ్చామన్నారు. అందిన దరఖాస్తులను సోమవారం ఉదయం 11 గంటలకు జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ ఆధ్వర్యంలో, జిల్లా ప్రొక్యూర్మెంట్ కమిటీ తనిఖీ చేసి, తక్కువ కొటేషన్ ఇచ్చిన రాయచోటికి చెందిన మస్తాన్ కు 3200 కళ్లద్దాల తయారీ పనిని అప్పగించినట్లుగా ఆయన పేర్కొన్నారు.




రైతు దినోత్సవం సందర్భంగా నేడు కే ఎల్ ఎం మహిళా ఇంజనీరింగ్ కళాశాల కార్యక్రమం నిర్వహించారు. పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ రైతు దేశానికి వెన్నెముక అని అన్నారు.అన్నదాతను ఆదుకోవడం కోసం ప్రభుత్వాలు కృషి చెయ్యాల్సి ఉంటుంది అని అన్నారు. ప్రకృతి విలయ తాండవం చేసినపుడు రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు.రైతు లేనిదే శూన్యం అని తెలిపారు. విద్యార్థులు నృత్య రూపకం ఆకట్టుకుంది. రైతు కృషిని కొనియాడుతూ గీతాలు పాడుతూ ఆహుతులను అలరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వి రత్నమ్మ గారు అన్ని శాఖల విభాగాదిపతులు స్టాఫ్ పాల్గొన్నారు.

# కలెక్టర్ రాకతో తెల్లపాడులో మారిన పరిస్థితులు





రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యలు విని అక్కడికక్కడే పరిష్కార మార్గం చూపించాలనే లక్ష్యంతో తీసుకొచ్చిన పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి కలసపాడు మండలంలోని తెల్లపాడు గ్రామంలో మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ స్కూల్లో రాత్రి బస చేసి గ్రామ ప్రజల సమస్యలను, అవసరాలను తెలుసుకొని పరిష్కారం మార్గం చూపిన నేపథ్యంలో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పల్లెనిద్రలో భాగంగా గత నెల నవంబర్ 22వ తేదీన కలసపాడు మండలం తెల్లపాడు గ్రామంలో పలు సమావేశాలు నిర్వహించి అక్కడి గ్రామ ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకొని అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేసిన మేరకు తెల్లపాడు గ్రామంలో చాలా సమస్యలకు పరిష్కారాలు చూపించారు.హరిజనవాడలో ఇళ్లపై నుంచి వెళ్లే విద్యుత్ తీగల తొలగింపుపల్లెనిద్ర లో భాగంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి హరిజనవాడలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగాఎస్సీలకు ఇల్లు మంజూరు కాగా తక్కువ మంది మాత్రమే ఇళ్ళ నిర్మాణాలు చేపట్టారని దీనికి ప్రధాన కారణం ఇళ్ల మధ్య పైనుంచి ఇళ్లపై నుంచి విద్యుత్ తీగలు వెలుతుండడంతో చాలామంది స్థలం పొందిన లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకోలేకపోతున్నట్లు జిల్లా కలెక్టర్ కు విన్నవించారు. ఈ సమస్యలు తెలుసుకున్న జిల్లా కలెక్టర్ వెంటనే విద్యుత్ అధికారులతో మాట్లాడి ఇళ్లపై నుంచి వెళ్లే విద్యుత్ తీగలను తొలగించి వేరే మార్గంలో నిర్వహించాలని అధికారులకు ఆదేశించిన మేరకు ఆ విధంగా ఎస్పీడీసీఎల్ అధికారులు 11 కెవి లైన్ విద్యుత్ తీగలను తొలగించి పక్కన కొత్త లైన్ ఏర్పాటు చేయడంతో హరిజనవాడలో స్థలాలు మంజూరైన లబ్ధిదారులు ఇల్లు కట్టుకోవడానికి మార్గం సుగమమైందని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కు కృతజ్ఞతలు తెలిపారు.మౌలిక వసతుల కల్పతెల్లపాడు గ్రామంలో త్రాగునీటి సమస్యలు, సిసి రోడ్లు మురుగు కాలవలు,లిఫ్ట్ ఇరిగేషన్ సమస్యలపై గ్రామ పెద్దలు తో నిర్వహించిన గ్రామ సభలో తెలిపిన సమస్యలకు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. అలాగే ఉపాధి హామీ పథకం కింద గ్రామానికి పనులు మంజూరైన పనులను వేగవంతంగా మొదలుపెట్టి మౌలిక వసతులు కల్పించాలన్నారు. మెరుగైన పారిశుద్ధంతెల్లపాడు గ్రామంలో ఎక్కడ చూసినా అపరిశుభ్రత పరిస్థితులు కనబడిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ గ్రామంలో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని గ్రామ సచివాలయ సిబ్బంది, పంచాయితీ పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించిన నేపద్యంలో గ్రామంలో పారిశుద్ధ పరిస్థితులు పూర్తిగా మెరుగయ్యాయి. వర్షాలు పడినప్పుడు గ్రామంలో వర్షపు నీరు నిలువ కాకుండా చూడాలని అధికారులకు ఆదేశించగా ఆ విధంగా చర్యలు చేపట్టి మురుగునీటి వ్యవస్థను శుభ్రం చేశారు. ఆర్టీసీ బస్సు రాకపోకలుఇప్పటికీ మా గ్రామానికి ఒక ఆర్టీసీ బస్సు కూడా లేదని పల్లెనిద్రలో భాగంగా జిల్లా కలెక్టర్ కు ఆ గ్రామ ప్రజలు, మహిళలు విన్నవించిన క్రమంలో జిల్లా కలెక్టర్ వెంటనే ఆర్టీసీ ఆర్ఎం కు ఆదేశాలు జారీ చేసి తెల్లపాడు గ్రామంలో విద్యార్థులు, మహిళలు, మండలానికి వెళ్లి పని చేసుకునే వారు ఇబ్బంది పడకుండా వెంటనే ఒక ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేసి రాకపోకలు నిర్వహించాలని సూచించిన మేరకు తెల్లపాడు గ్రామంలో ఆర్టీసీ బస్సు రాకతో గ్రామ వాసులు ఆనంద ఉత్సవాల్లో మునిగిపోయారు.